గెడా రంగారావు

ఈశ్వరానంద శిష్యులు!

కంచర్ల రమణ

తన యింటిముందు పోలీసు కారాగడం, అందులోంచి డి. యస్. పీ. రంగనాథరావు దిగడం చూసి ఆశ్చర్య పోయాడు కమర్షియల్ టాక్స్ ఆఫీసరు సుగుణాకర్. తన మీద యేదన్నా లంచాల కేసు వుందేమోనని, యింకో ప్రక్కనుంచి అతనిలో సన్నగా భయంకూడా మొదలయ్యింది.

"గుడ్ యీవెనింగ్! ... వెల్ కమ్ టు మై హంబుల్ హోమ్!" అన్నాడు సుగుణాకర్, పేపరు మడిచి, టీపాయ్ మీద పెట్టి, లేచి నిలుచుని నవ్వుతూ.

"గుడ్ ఈవెనింగ్!...మీ సాయంసమయాన్ని పాడు చేసాను," వరండాలోకి వచ్చిన రంగనాథరావు నవ్వి అన్నాడు.

రంగనాథరావు వచ్చింది లంచాల కేసుమీద కాదు, వేరే కారణంవల్ల అని గ్రహించాడు సుగుణాకర్. ఇందాకటి భయం యిప్పుడు అతనిలో లేదు.

"నా పెటాల్! నా పెటాల్!...కూర్చోండి" అంటూ తను అంతవరకూ కూచున్న వాలుకుర్చీ రంగనాథరావుకి ఆఫర్ చేసాడు సుగుణాకర్.

రంగనాథరావు కుర్చీలో కూచుంటూ "ఐదు నిముషాలంటే అయిదునిముషాలు మీతో మాట్లాడాలి. మీరూ కూచుంటే బావుంటుంది" అన్నాడు.

ప్రక్కగదిలోంచి ఓ కుర్చీ తెచ్చుకుని కూచున్నాడు సుగుణాకర్.

"బియ్యం టోకు వ్యాపారస్తుడు తాతారావుమీద టేక్స్ కేసులేమైనా వున్నాయా?" అడిగాడు రంగనాథరావు.

"ఎవరాయన?" నొసలు చిట్లించి అన్నాడు సుగుణాకర్, చప్పున ఆ వ్యక్తి యెవరో గుర్తుకు రాక.

"అదే! ... అన్నపూర్ణా ఎంటర్ప్రైజెస్ ... డబుల్ రోడ్ లో వుంది గదా," చెప్పాడు రంగనాథరావు.

దాంతో గుర్తొచ్చింది సుగుణాకర్ కు, తాతారావు యెవరో. "ఆఁ...గుర్తొచ్చింది...ఎందుకూ?" అన్నాడు సుగుణాకర్ మెరిసే కళ్ళతో.

"మాకో కేసు విషయంలో తాతారావు సాయం కావాలి. అంచేత, అతడిమీద టేక్స్ కేసులున్నాయేమో చెప్పగలరా?"

"తాతారావు చాలా కరెక్టు మనిషండీ! లెక్కలు పక్కాగా మెయిన్ టెయిన్ చేస్తాడు. ఇహ, టేక్స్ కట్ట

డంలో యెప్పుడూ జాప్యం చెయ్యడు. అయితే, మొన్న సడెన్‌గా చెక్ చేస్తే స్టాకుకీ, ఎకౌంట్ బేలన్స్‌కీ తేడా వచ్చింది. ఫార్మల్‌గా కేసు బుక్ చేసాం.''

''అమ్మయ్య! బ్రతికించారు. ఏ కేసులూ లేవని చెప్తుంటే బెంగపడ్డాను. చాలు! ఆ మాత్రం చాలు! ఇంతకూ అంత కరెక్టు మనిషి ఆ తప్పెలా చేసాడంటారు?''

''నిజానికి అది తప్పు కాదు. వ్యాపారస్తులకో అలవాటుంది. రాత్రికి యిళ్ళకు పోయిగాని అవాల్టి ఎకౌంట్స్ సరి చేసుకోరు. కొన్ని వస్తువులకి బిల్లు అడగడం మన కస్టమర్స్‌కి అలవాటు లేదు. తరువాత బిల్లు కట్ చెయ్యొచ్చులే అని ముందు సరుకు యిచ్చేస్తారు వ్యాపారస్తులు... అదే తెచ్చింది చిక్కు యిప్పుడు అతనికి.''

''అంటే, అదో పెద్ద నేరం కాదన్నమాట.''

''కాదు. సామాన్యంగా వ్యాపారస్తులు చేసే తప్పు అది.''

''అయితే, ఆ కేసు మేం కొట్టెయ్యమంటే కొట్టెయ్యగలరన్నమాట?''

''ఏమిటి? తాతారావు సిఫార్సు పంపాడా మీ ద్వారా?'' నవ్వాడు సుగుణాకర్.

''నో! నో! అదేం కాదు. మా డిపార్టుమెంటుకే అతనితో అవసరం పడింది. అతని అండర్‌గ్రౌండ్ గోడౌన్స్ మేం వాడుకోవాలి కొన్నాళ్ళు.''

''ఏమిటో విశేషం?'' కుతూహలంగా అడిగాడు సుగుణాకర్.

''దయచేసి ఆ వివరాలేవీ అడగవద్దు. అది టాప్ సీక్రెట్. అందుకే మీ ఆఫీసుకు రాకుండా, యిక్కడి

కొచ్చి మాట్లాడుతున్నాను మీతో. అసలు అదేమిటో నాకుకూడా పూర్తిగా తెలీదు. నేను యిప్పుడు ఎస్. పీ. గారి ఆదేశంమీద యిక్కడికి వచ్చాను. మీకు కావాలంటే, ఆ కేసు డ్రాప్ చెయ్యమని, మా డిపార్టుమెంటు ఆర్డర్స్ తీసుకురాగలను."

"నో! నో! అవసరంలేదు. ఆ కేసు డ్రాప్ చెయ్యగలను."

"అయితే, రేపోసారి, తాతారావు షాపుకి వెళ్దాం. రాగలరా?"

"రాగలను. ఎన్ని గంటలకు?"

"మీరు రావద్దు. నేనే వస్తాను. ఉదయం ఎనిమిదిన్నర ప్రాంతంలో యిక్కడకు వస్తాను. మన పోలీసుకారులోనే వెళ్దాం. సిద్ధంగా వుండండి" అంటూ లేచాడు రంగనాథరావు.

"అలాగే...తప్పకుండా వెళ్దాం...ఐ ప్రోమిస్ యూ" అన్నాడు సుగుణాకర్.

రంగనాథరావు కదిలి వెళ్ళి కారులో కూచోగానే, కారు బయలుదేరింది.

2

తన షాపుముందాగిన పోలీసు కారులోంచి దిగిన డి. యస్. పి. రంగనాథరావుని, సీ. టీ. ఓ. సుగుణాకర్ నీ చూడగానే, తాతారావు ప్రాణాలు కడబట్టిపోయాయి.

మూడురోజుల క్రితం జరిగిన సర్ప్రైజ్ చెక్ లో తను దొరికిపోయిన దగ్గర్నుండీ, తాతారావుకు రాత్రిళ్ళు నిద్ర పట్టడంలేదు. ఈ కేసులోంచి బయటపడితే, వెంకటేశ్వర స్వామికి తలనీలాలు యిచ్చి హుండీలో వెయ్యినూట పదహార్లు వేస్తానని మొక్కుకున్నాడుకూడా.

సీ. టీ. ఓ., డి. యస్. పీ. ని వెంటబెట్టుకుని రావడం చూస్తుంటే, స్టాకు బేలన్సులో వున్న డిస్క్రిపెన్సీమీద డిపార్టుమెంటు గట్టి యేక్షనే తీసుకోబోతోందని అర్థం చేసుకుని క్రుంగిపోయాడు పూర్తిగా.

అయినా—"రండి సార్! దయచెయ్యండి!" మొహం మీద తెచ్చిపెట్టుకొన్న నవ్వుతో, ఆ ఆఫీసర్లని లోనికి ఆహ్వానించి కుర్చీలు చూపాడు తాతారావు.

తమని చూడగానే తాతారావు మొహం కళ దప్పి పోవడం రంగనాథరావు గ్రహించాడు. తనకు అవసరమయ్యే మూడ్ తాతారావులో యేర్పడినందుకు లోలోన సంతోషించాడు.

తాతారావు చూపిన కుర్చీలో కూచోకుండా "లోన మీకు ఓ ప్రైవేట్ రూం లేదా?" అన్నాడు రంగనాథరావు.

ఉందనాలో, లేదనాలో తెలీక కాసేపు తటపటాయించాడు తాతారావు. "ఉంది సార్! పదండి" అన్నాడు.

తాతారావు ముందు దోవ తియ్యగా, అతడ్ని అనుసరించారు డి. యస్. పీ., సీ. టీ. ఓ.

అదో చిన్న గది. దాని తీరు చూడగానే, అదో ఆఫీసు రూం కమ్ డ్రాయింగ్ రూం అని అర్థం చేసుకోవచ్చు. ఓ టేబిలుకు అటు ఓ కుర్చీ, యిటు రెండు కుర్చీలు వున్నాయి. టేబిలుమీద, ఏవో పుస్తకాలు, ఫైళ్ళు వున్నాయి. దగ్గరలోవున్న రేక్‌లో కూడా పుస్తకాలు, ఫైళ్ళు దొంతర్లు వున్నాయి.

"వెరీ గుడ్! ఇక్కడికి ఎవరూ రారు గదా? లేకపోతే, ఎవరూ రాకుండా, కాసేపు యేర్పాటు చెయ్యండి,"

అన్నాడు రంగనాథరావు, ఆ గదిలోకి రాగానే.

"ఎవరూ రారు సార్!" అంటూ హామీ యిచ్చాడు తాతారావు.

డి. యస్. పీ., సీ. టీ. ఓ. కుర్చీల్లో కూచున్నారు. తాతారావు మాత్రం నిలుచునే వుండిపోయాడు.

"మీరూ కూచోండి శెట్టిగారూ!" అన్నాడు సుగుణాకర్.

బెరుగ్గానే కూచున్నాడు తాతారావు.

"మొన్న మీరు స్టాక్ బేలన్సు చూపడంలో దొరికి పోయారట?" ఆరంభించాడు రంగనాథరావు.

"అవును సార్! పొరబాటయిపోయింది" తాతారావు గొంతులో ఏడుపు జీర కన్పించింది.

"మీకు తెలుసా? కలకత్తాలో అక్రమ వ్యాపారస్తుల్ని అరెస్టుచేసి వీధుల్లోంచి ఎలా యీడ్చుకెళ్ళారో?", అన్నాడు రంగనాథరావు చాలా సీరియస్‌గా.

తాతారావు దాంతో బేలయిపోయేడు మానసికంగా.

"సీ. టీ. ఓ. గారు యిక్కడే వున్నారు అడగండి సార్. ఇంతకుముందు నామీద యెప్పుడూ కేసులు లేవండి. ఇదే మొదటి కేసు. ఇదే ఆఖరికేసుకూడా" అన్నాడు తాతారావు.

"ఆల్ రైట్! అలాగంటున్నారు కాబట్టి, మిమ్మల్ని కేసులోంచి తప్పించేస్తాను. అయితే, మీరు నాకో సాయం చెయ్యాలి" అన్నాడు రంగనాథరావు, తాతారావు పూర్తిగా షేక్ అయ్యాడని నిర్ధారించుకున్నాక.

అలాంటి అవకాశం యెప్పుడొస్తుందా పనియోగించు కుందామా అని ఎదురుచూస్తున్న తాతారావు, "చెప్పండి

సార్! మీకు నాశక్తి మేరకు సాయం చేస్తాను,'' అన్నాడు ఆలస్యం చెయ్యకుండా.

''నాకంటే నాకు కాదు. మా డిపార్టుమెంటుకు'' మాట సవరించుకున్నాడు రంగనాథరావు.

''ఎవరికయినా సరే, చెయ్యడానికి సిద్ధమే. చెప్పండి సార్'' అన్నాడు తాతారావు ఆనందంగా.

''ఏమీ లేదు. మీ అండర్‌గ్రౌండ్ గొడౌను కొన్నాళ్లు మా డిపార్టుమెంటువాళ్ళం వాడుకుంటాం'' అని మొదలు పెట్టి ఆగాడు రంగనాథరావు, తాతారావు రియాక్షన్ కోసం యెదురుచూస్తూ.

''అదెంత మాట సార్! తప్పకుండా. కానీ, అందులో నా స్టాకు వుందే!'' అన్నాడు తాతారావు సందేహంగా.

''సరుకు ఉండనివ్వండి, కావలసి వచ్చినపుడు తీసుకోండి. దాంతో మాకేం యిబ్బంది వుండదు,'' చెప్పాడు రంగనాథరావు.

''అలాగయితే, ఎన్నాళ్ళు కావలిస్తే అన్నాళ్ళు నా గొడౌను వాడుకోండి. నా కభ్యంతరం లేదు.''

''అయితే ఒక షరతు. ఇలా మీ గొడౌను తీసుకొన్నట్టు మీ యింటి ఆడవాళ్ళకుకూడా తెలియగూడదు తెలిసిందా! చాలామంది పీకలు తెగిపోతాయి. అందులో మీదీ ఒక పీక అని గుర్తుంచుకోండి,'' అన్నాడు రంగనాథరావు తీవ్రంగా.

''అమ్మమ్మ! ఎంత మాట. దేవుడి తోడు సార్! ఈ రహస్యం నాలోనే ఉండిపోతుంది,'' ఒట్టుపెట్టాడు తాతారావు.

''ఓ.కే! అయితే, రేపు మా వాళ్ళు యిద్దరు వస్తారు

మప్టీలో. వాళ్ళు ఉండడానికి యేర్పాట్లు చెయ్యండి. అయితే, వాళ్ళు లేనట్టుగానే, మీ వ్యవహారాలు సాగించండి,'' లేచి అన్నాడు రంగనాథరావు. సీ. టి. ఓ. కూడా లేచాడు.

3

ఉదయం పది గంటలయింది. బియ్యం కొనుక్కోవడానికి వచ్చిన మనుషులతో చాలా బిజీగా వున్నాడు తాతారావు.

''తాతారావుగారూ!''

ఆ పిలుపు తన కస్టమర్స్ పిలిచినట్టుగా లేకపోయేసరికి, తలెత్తి చూసాడు తాతారావు.

''రంగనాథరావుగారు నిన్న మీతో మాట్లాడేరు గదూ!'' అన్నాడు ఓ చేతిలో సూట్‌కేసు పట్టుకుని నిలుచున్న వ్యక్తి.

అతని ప్రక్కన యింకో వ్యక్తి వున్నాడు. అతని చేతిలో పెద్ద సంచీ వుంది.

ఆ వచ్చింది పోలీసు డిపార్టుమెంటు మనుషులని గ్రహించేడు తాతారావు. చేస్తున్న పని సగంలోనే ఆపేసి లేచి, ''రండి'' అంటూ లోనికి దారితీసాడు.

ఆ యిద్దరు వ్యక్తులు తాతారావుని అనుసరించారు.

తిన్నగా వాళ్ళని గొడౌనులోకి తీసుకెళ్ళాడు తాతారావు.

''ఇదీ మా అండర్ గ్రౌండ్ గొడౌను. దీన్ని మీ కిమ్మని చెప్పారు రంగనాథరావుగారు,'' అన్నాడు తాతారావు.

"ఓ కే! మాకో టేబిలు, రెండు కుర్చీలు కావాలి" అన్నాడు సూట్ కేసు పట్టుకున్న వ్యక్తి.

"అలాగే!" అంటూ వెంటనే వెనక్కి పరుగెత్తి, తన ప్రైవేట్ రూంలోని టేబిలు, రెండు కుర్చీలు పనివాళ్ళ చేత తెప్పించి వేయించాడు తాతారావు.

"ఇంకా ఏమైనా కావాలా?" అన్నాడు తాతారావు తన పని చూసుకోవడానికి వెళ్ళిపోబోతూ.

"తరువాత వచ్చి అడుగుతాం లెండి" చెప్పాడు చేతిలో సంచీ పట్టుకున్న వ్యక్తి.

తాతారావు వెళ్ళిపోయాడు.

గొడౌను తలుపులు దగ్గరగా లాగి, గడియపెట్టాడు సంచీ పట్టుకున్న వ్యక్తి,

ఆ యిద్దరు వ్యక్తులు యిద్దరు ఇంటెలిజెంస్ ఆఫీసర్లు. వారి చేతుల్లోవున్న సూట్ కేసు, సంచీల్లో టెలిఫోను కాల్స్ రిసీవ్ చేసుకునే సెట్ వుంది.

ఆ తాతారావు రైస్ షాపుకు పదిగజాల దూరంలో స్నొ వైట్ అనే బార్ అండ్ రెస్టారెంట్ వుంది.

ఆ రెస్టారెంట్ ఇంచుమించు ఇరవైనాలుగు గంటలూ తెరిచే వుంటుంది. ఏవేళప్పుడయినా ఊర్లో టీ, టిఫిన్, భోజనం దొరక్కపోవచ్చు గాని, ఆ రెస్టారెంట్‌లో మాత్రం అవి అన్నివేళల్లోనూ దొరుకుతాయి. ఆ కారణం వల్లనో, మరే కారణంవల్లనో, ఆ రెస్టారెంట్ యెప్పుడూ రద్దీగానే వుంటుంది.

ఆ రెస్టారెంట్ ప్రొప్రయిటర్ నూకరాజు యెంతో మర్యాదస్తుడు, మంచివాడు అని ప్రతీతి. టౌనులో వున్న పెద్ద ఆఫీసర్లందరూ నూకరాజుకు పరిచయస్తులే. ఏదో సందర్భంలో అతని సహాయాన్ని పొందినవారే.

సెంట్రల్, స్టేట్ కేబినెట్ మంత్రుల్లో చాలామంది అతనికి తెలుసంటారు అందరూ. అది నిజమే అన్నట్టుగా, టౌనులోకి వచ్చిన ప్రతీ మంత్రీ, నూకరాజు ఆతిథ్యం పొందక, నూకరాజుతో రెండు నిముషాలయినా మాట్లాడక తిరిగి వెళ్ళిపోరు వెనక్కి.

అలాంటి నూకరాజు నడుపుతున్న రెస్టారెంట్లో 'హిరోయిన్' అనే మత్తుమందు వ్యాపారం పెద్ద యెత్తున సాగుతోందని, ఓ గాలివార్త పోలీసు డిపార్టుమెంటుకు చేరింది.

అయితే, గాలివార్తలను బట్టుకుని యేక్షన్ తీసుకుంటే చాలా ప్రమాదాలున్నాయి, ముఖ్యంగా నూకరాజువంటి పలుకుబడి గల పెద్దమనిషి విషయంలో.

విశాఖలోనూ, అంతేగాదు, ఆంధ్రదేశంలో కొన్ని ముఖ్యపట్టణాల్లో యిటీవల విస్తారంగా మత్తుమందులు దొరుకుతున్నాయన్నది నిర్వివాదాంశం. అయితే; యెక్కడ్నించి, ఎవరూ, ఎలా తెచ్చి పంపిణీ సాగిస్తున్నారన్నది అంతు తేలకుండా వుంది.

చిన్న చిన్న మొత్తాలమ్మే, కిల్లీ కొట్టువాళ్ళనో, టీ దుకాణాలవాళ్ళనో, అడపా దడపా అమాయకంగా దొరికిపోయే 'డెలివరీ బోయ్స్' నో పట్టుకుని శిక్షించడం వల్ల లాభం లేదన్నది పోలీసు డిపార్టుమెంటుకు అనుభవం అయిపోయింది.

'మూలవిరాట్టులు' పట్టుబడనంత కాలం, యీ డ్రగ్ ట్రాఫిక్ ఆగదని నిలకడమీద అర్థమయిపోయింది పోలీసులకు.

అందుచేత, ఓ సుదీర్ఘమైన, పటిష్టమైన పథకం ఒకటి

తయారుచేసారు. దాని ప్రకారం వెళ్ళితే, మూలవిరాట్టులు వలలో చిక్కుకుపోవచ్చు.

ఆ పథకంలోని మొదటి అంశమే సాఫ్ట్ వైట్ బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చేపోయే కాల్స్‌ని టేప్ చెయ్యడం. నెల క్రితం, పోలీసులు అతి నేర్పుగా ఫోన్ టాపింగ్ డివైస్ ఆ రెస్టారెంట్‌లో బిగించారు.

తాతారావు అండర్‌గ్రౌండ్ గొడౌన్ నుండి ఆ డివైస్‌కి మోనిటర్ చేయడానికి నిశ్చయించుకుంది పోలీసు డిపార్టుమెంటు.

4

వారంరోజులు గడిచాయి.

జగ్గూ, రామూ—ఇంటెలిజెంస్ ఆఫీసర్లు తాత్కాలికంగా తమకు పెట్టుకొన్న పేర్లు—అనుమానాల్ని రేకెత్తించే ఒక్కటంటే ఒక్కటి కాల్ సాఫ్ట్ వైట్ రెస్టారెంట్‌కు రాలేదు యీ వారం రోజుల్లో.

అప్పుడే రాము ఓర్మి తరిగిపోయింది.

ఓ రోజు రాత్రి తన తలకు తగిలించుకున్న రిసీవింగ్ సెట్‌ని టేబిలుకేసి కొట్టి "ఎవడో పోలీసు డిపార్టుమెంట్‌కి తప్పుడు భోగట్టా అందించి బురిడీ కొట్టించాడు" అన్నాడు కోపంగా.

"పేషెన్స్ ఫ్రెండ్! పేషెన్స్! ఇప్పుడే మనం పట్టు వదలగూడదు" అన్నాడు జగ్గు, తను చదువుతూన్న పుస్తకంలోంచి తలెత్తి.

"మనం పిచ్చివెధవలంగాని, ఎవడైనా ప్రమాదకరమైన విషయాలు ఫోనులో మాట్లాడతాడా?" అన్నాడు రాము విసుగ్గా.

"ఆల్ రైట్! నువ్వన్నది కాదనడంలేదు. కాని మన 'సద్గురు' ఆ విషయం ఆలోచించలేదంటావా?" అడ్డు తగిలాడు జగ్గు.

సద్గురు అంటే సూపరింటెంట్ ఆఫ్ పోలీస్. డిపార్టుమెంట్‌లో తమ బాస్ గురించి మాట్లాడుకునేటప్పుడు 'సద్గురు' అనడం వాళ్ళకు అలవాటు.

"నువ్వేం చెప్పు, ఇక నావల్ల గాదు. ఆ నాన్సెన్స్ వినే ఓపిక నాకు లేదు, రాసే శక్తి అంతకన్నా లేదు" అంటూ టేబిలు ముందునించి లేచిపోయాడు రాము.

ఈ వారంరోజులూ, సాఫ్టు వైట్ రెస్టారెంట్‌కు వచ్చే కాల్స్ వినడమే గాకుండా, ఫోను చేసేవారి పేర్లు, వారిచ్చిన ఫోను నెంబర్లు ఓపిగ్గా జాబితా రాస్తూ వచ్చారు.

"బ్రదర్! రెస్టు తీసుకో! ఇంటెలిజెన్స్ బ్రాంచి అంటే ఎంతో ఓపికతో కూడిన వ్యవహారం. ఒక్కొక్కసారి చిన్న భోగట్టాకోసం నెలలుకూడా గడపాల్సి వస్తుంది" అంటూ తను వెళ్ళి, టేబిలు ముందు కూచుని, తలకు సెట్ తగిలించుకుని, కాల్స్ వినసాగాడు జగ్గు.

ఆ రాత్రి గడిచిపోయింది. ఇంకో రోజుగూడా గడిచిపోయింది, ఫలితం లేకుండా.

ఆ రెండవరోజు రాత్రి పదిగంటలవుతుండగా, చిత్రాతిచిత్రమైన ఫోను కాలొకటి వచ్చింది సాఫ్టు వైట్ రెస్టారెంట్‌కి.

"సుబ్బారావుగారూ! సుబ్బారావుగారూ!" అవతలినించి ఓ గొంతుక.

క్షణం పోయాక —

"నేనే సుబ్బారావుని. ఏం కావాలి చెప్పండి?"

ఆ గొంతుక, రెస్టారెంట్ ప్రొప్రయిటర్ నూకరాజుది.

నూకరాజు తను సుబ్బారావు అంటూ చెప్పుకోవడమే డ్యూటీలో వున్న రాము అనుమానాల్ని రెచ్చగొట్టింది.

"పాపాయి వచ్చిందా ఊరునించి" అవతలి గొంతు.

"వచ్చింది నిన్ననే" నూకరాజు గొంతు.

"అమ్మయ్య..." అవతలి గొంతు నిట్టూర్పు.

"ప్రెజెంట్ అరకేజీ కేకు తప్పకుండా తీసుకు రాకండి" నూకరాజు గొంతు.

"అర కేజీ యేం కర్మ? కేజీ కేక్ పట్టుకొస్తున్నాను. అవునూ; బజారులో కేక్ ధర అలాగే వుందా? పెరిగిందా?" అవతలి గొంతు.

"అంతే! రేట్ లో మార్పు లేదు" నూకరాజు గొంతు.

"మరి ప్రెజెంట్ యెప్పుడు తీసుకురాను?" అవతలి గొంతుక ప్రశ్న.

"రేపు రాత్రి తొమ్మిది గంటలకు" నూకరాజు జవాబు.

"థేంక్యూ! కిస్సెస్ టు బేబీ" అవతలి గొంతు.

మరోమాట మాటాడకుండా నూకరాజు ఫోను పెట్టేసాడు.

చల్లగా ఆ సంభాషణ వినడమే గాకుండా, దాన్ని ఓ కాయితంమీద రాసి జగ్గూకు పాసాన్ చేసాడు రాము.

సెట్ ని తలమీంచి తీసేస్తూ, "ఇన్నాళ్ళూ మనం వెయిట్ చేస్తున్నది, చివరకి దొరికిం దనుకుంటున్నాను. నువ్వేమంటావ్" అన్నాడు.

తన చేతికొచ్చిన కాయితాన్ని రెండు నిముషాలు ధ్యానంగా చదివి "పాపాయి", "ప్రెజంట్" అన్న మాటలు తీసేసి "హీరోయిన్", "డబ్బు" అన్నమాటలు పెట్టుకుంటే, మనకు కావాల్సింది దొరికిందనే అనిపిస్తోంది" అన్నాడు జగ్గు సంతోషంతో మెరిసే కళ్ళతో.

"దెన్ లెట్ అజ్ గో టూ సర్గురు ఫర్ ఫర్దర్ ఆర్డర్స్" రాము ఉత్సాహంగా లేచాడు.

5

ముందరుంచిన రాయితాన్ని అందుకుని, నిదానంగా రెండుసార్లు చదివాడు ఎస్. పి. సుందర్రామ్.

"మనవాళ్లు సాధించినట్టుగనే అగపడ్తోంది" అన్నాడు తలెత్తి.

"అదే నేనూ అనుకుంటున్నాను సార్!" అన్నాడు డి. ఎస్. పి. రంగనాథరావు హుషారుగా.

"దెన్ వాట్ నెక్స్ట్?" అంటూ కుర్చీలో విశ్రాంతిగా వెనక్కి వాలాడు సుందర్రామ్.

"మీరు ఓకే అంటే, ఇవాళ డెలివరీ జరుగుతుండగా రెడ్ హేండెడ్‌గా వాళ్ళని పట్టుకుని అరెస్టు చేస్తాం," చెప్పాడు రంగనాథరావు ఆవేశంగా.

'తప్పు! తప్పు!' అన్నట్టుగా చెయ్యి ఊపుతూ, "మనుషులు గాని, డిపార్టుమెంటులు గాని ఒకసారి చేసిన తప్పులు మళ్ళా చేస్తే, స్టుపిడ్స్ అనాల్సి వస్తుంది. గతంలో చేసిన తప్పుల్నుంచి గుణపాఠం నేర్చుకోకపోతే వాళ్ళ లాంటి ఫూల్స్ ఇంకొకళ్ళుండరు. ఒకసారి రికార్డ్స్ చదువు. స్ట్రీకేసెస్‌ని పట్టుకోవడంవల్ల ఫలితం లేదు. ఈ బిజినెస్‌ని వేళ్ళతో పీకెయ్యడం నాకు కావాలి. ఇవాళ మీరు చెయ్యాల్సిందంతా యేమంటే, అసలు ఆ డెలివరీ వగైరా ఎలా జరుగుతున్నాయో చూసి రండి" అన్నాడు సుందర్రామ్ తాపీగా, హుందాగా.

"అంతేనంటారా?" నిరుత్సాహంగా అన్నాడు రంగనాథరావు.

"అంతే! అంతకుమించి ఒక్కడుగు మీరు ముందుకు వేసినా, మీ కెరియర్స్ రిస్క్‌లో వుంటాయని గుర్తు పెట్టుకోండి" సుమారు ఆరంగుళాల పొడవున్న తన కుడి చేతి చూపుడువేలు తాటిస్తూ అన్నాడు సుందర్రామ్ తీవ్రంగా.

"అయితే, నాతో ఎవర్ని తీసుకెళ్ళమంటారు సార్!" అడిగాడు రంగనాథరావు, మనుషుల ఎన్నిక విషయంలో కూడా, సుందర్రామ్ ఆర్డర్స్ తీసుకోవాలేమోనన్న అనుమానంతో.

"అది నీ యిష్టం. యూ వర్కౌట్ డిటెయిల్స్! నా ఆర్డర్స్ మాత్రం స్పష్టంగానే వున్నాయి కదా. అక్కడేం జరుగుతోందో, ఎలా జరుగుతోందో చూసి, అన్ని వివరాలతో నాకు రిపోర్టు చెయ్యడంవరకే మీ డ్యూటీ, తెలిసిందా?" మరోసారి జాగ్రత్త చెప్పాడు సుందర్రామ్.

"తెలిసింది సార్!" అన్నాడు రంగనాథరావు, సుందర్రామ్ చెప్పింది మననం చేసుకుంటూ.

తన ఛాంబర్‌కు తిరిగివచ్చాడు డి. ఎస్. పి. రంగనాథరావు.

చాలాసేపు ఆలోచించినమీదట, సబిన్స్పెక్టరు సీతాపతిని తనతో తీసుకెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు.

కాలింగ్ బజర్ నొక్కాడు.

మెసెంజర్ అప్పారావు వచ్చాడక్కడికి.

"పోయి సబిన్స్పెక్టరు సీతాపతిని నేను రమ్మన్నానని ఉన్నపళంగా తీసుకురా" అన్నాడు రంగనాథరావు.

"అలాగే సర్!"

మెసెంజర్ అప్పారావు వెళ్ళిపోయాడు.

అయిదు నిముషాలు గడిచాయి.

"సార్! పిలిచారుట!" అంటూ సన్నగా, పొడుగ్గా, యెర్రగా, అయిదడుగుల పదంగుళాల పొడవు, ముప్ఫై రెండేళ్ళ వయస్సున్న సబిన్స్పెక్టరు సీతాపతి, చురుకైన చూపులతో, నిదానమైన అవయవాల కదలికతో లోనికి అడుగుపెట్టాడు.

తను చేసే ప్రతి పనీ, విజయవంతమయ్యేంతవరకూ అచంచల దీక్ష, నిర్విరామ కృషి సలపడంలో వెనుకంజ వెయ్యడని, అతని ప్రతి కాన్ఫిడెన్షియల్ రిపోర్టులోనూ పై ఆఫీసర్లు రిమార్క్సు రాసారు.

స్పెషల్ ఎసైన్మెంట్స్ యివ్వాల్సి వచ్చినప్పుడల్లా అతన్ని పిలుస్తారు, అతని గురించి తెలిసిన ఆఫీసర్లు.

"ప్లీజ్ సిడౌన్! నీతో ఓ అర్జంటు విషయం మాట్లాడాలి" అంటూ తన ముందున్న కుర్చీ సీతాపతికి ఆఫర్ చేసాడు రంగనాధరావు.

'థేంక్స్' చెప్పి కూచున్నాడు సీతాపతి.

"ఇవాళ మనం ఇద్దరం డ్యూటీలో వుండబోతున్నాం" అంటూ రాత్రికి తాము నెరవేర్చబోయే వాచింగ్ ఆపరేషన్ గురించి వివరంగా చెప్పి, "నీ ఐడియాస్ ఏమిటి?" అంటూ ముగించాడు రంగనాధరావు.

ఐదు నిముషాల మవునానంతరం "మన పోలీసు కార్లో వెళ్ళే విషయం మర్చిపోండి సార్! మనవాళ్ళ దెవరిదో ఓ కారు ఎరువు తీసుకుందాం. ఐతే, దానికో ఫేక్ నెంబరు ప్లేట్ తగిలిద్దాం," అంటూ చెప్పడం ఆరంభించాడు సీతాపతి.

"ఫేక్ నెంబరు ప్లేటెందుకు?" సీతాపతి మాటల్ని కట్ చేసాడు రంగనాధరావు.

"సింపుల్! మనం వాళ్ళని వాచ్ చేస్తున్నట్టుగానే, వాళ్లెవరయినా, తమని పోలీసులు వాచ్ చెయ్యడంలేదు గదా అని వాళ్ళూ వాచ్ చెయ్యవచ్చు. అలాంటప్పుడు మన కారు నెంబరు వాళ్ళు నోట్ చేసుకోవచ్చు. కారు మన స్నేహితులిది కాబట్టి, వాళ్ళు చిక్కుల్లో పడతారు" వివరించాడు సీతాపతి.

"వెరీ గుడ్. ప్రొసీడ్ ఫర్దర్!" రంగనాధరావు ప్రోత్సహించగానే, సీతాపతి చెప్పసాగాడు మళ్ళా.

"రెస్టారెంట్ కు కాస్త దూరంలో, మనం యెవరి రాక కోసమో యెదురుచూస్తున్నట్టు కనిపించేలా ఆపాలి. మనతో బైనాక్యులర్స్ తీసుకెళ్ళడం మంచిది. మనకు కావాల్సిన వ్యక్తి వచ్చి వెళ్ళాక కూడా, మరో అరగంట ఆగి వెళ్ళాలి. వీలైతే, మన డిపార్టుమెంటు మనిషే మఫ్టీలో ఆ సమయానికి అక్కడకు వచ్చి కలిసే యేర్పాటు చేసుకుంటే, అతడు రాగానే బయలుదేరి వెళ్ళడం సరిగ్గా అతికినట్టుగా వుంటుంది" తన ఊహాలు తెలియజేసాడు సీతాపతి.

6

రాత్రి ఎనిమిదిన్నరయింది.

సాఫ్టు వైట్ బార్ అండ్ రెస్టారెంట్ చాలా రద్దీగా వుంది, వచ్చీపోయే జనంతో.

నియోన్ దీపాల్తో అలంకరించిన రెస్టారెంట్ పేరు, ఉండి ఉండి ఆరి వెలుగుతూ, దారినపోయేవాళ్ళ చూపుల్ని ఆకర్షిస్తోంది.

రెస్టారెంట్ ముందరభాగం అంతా సుమారు పాతిక, ముప్పై కార్లు; పది, పదిహేను స్కూటర్లతో నిండివుంది.

వాటికి కాస్త దూరంలో తమ కారు ఆపి ఉంచడం విడ్డూరంగా లేకపోయినా, రెస్టారెంట్‌కు వచ్చే అంత మంది జనంలో తమకు కావాల్సిన వ్యక్తిని యెలా గుర్తు పట్టడం? అనుకున్నాడు రంగనాథరావు, బైనాక్యులర్స్‌తో పరిశీలిస్తూ.

క్షణాలు దొర్లిపోతున్నాయి. తొమ్మిది గంటలయింది. రెస్టారెంట్‌కు వచ్చే మనుషుల్ని నిశితంగా పరిశీలించ సాగాడు, సీతాపతి.

అయిదు, పది, పదిహేను నిముషాలు గడిచాయి. రంగనాథరావుకేదీ విడ్డూరంగానూ, అనుమానాస్పదం గానూ కనిపించలేదు.

తొమ్మిది గంటలకు ఎపాయింట్‌మెంట్ యిచ్చిన వ్యక్తి, వచ్చి వెళ్ళిపోయి వుంటాడని, నిశ్చయించుకుని, నిరాశ పడసాగాడు సీతాపతి.

అదే సమయంలో నల్లగా, పొడుగ్గా, సన్నగా వుండి, పొడుగాటి జులపాలు, హేండిల్ బార్ మీసాలు, అధునాతనంగా డెనిమ్ బట్టల్లో డ్రెస్సప్ అయివున్న, సుమారు ముప్పైయేళ్ళున్న వ్యక్తి, రెస్టారెంట్ ద్వారంవద్ద ఆగ పడ్డాడు.

ఆ వ్యక్తి మెల్లగా బయటకు వచ్చాడు. యధాలాపంగా నిలుచుని, రోడ్డు కటూ యిటూ చూసాడు.

తరువాత మెల్లిగా కదిలి, రెస్టారెంట్ వద్ద పార్క్ చేసిన ఓ కారువద్దకు కదిలి వెళ్ళాడు.

రెస్టారెంట్‌కు వచ్చినపుడు ఆ వ్యక్తి మోటర్ సైకిల్

మీద వచ్చాడన్న విషయం రంగనాథరావు మెదడులో క్షణం మెరిసి ఊరుకుంది.

ఆ కారు తనదే అయినట్టు, యధాలాపంగా వెళ్ళి కారు డిక్కీ తెరిచాడు.

కారు డిక్కీ మూస్తుంటే, ఆ వ్యక్తి చేతిలో ఓ పాకెట్టు వుండడం చూసారు రంగనాథరావు, సీతాపతి.

అదేం పాకెట్టు?

క్షణంలో ఆ వ్యక్తి, పాకెట్టుని, చొక్కా లోపల పెట్టుకొన్నాడు. అంతే! ఆ తరువాత చకచకా లోనికి వెళ్ళి తిరిగొచ్చి, తన మోటార్ సైకిలెక్కి వెళ్ళిపోయాడు మరు నిముషంలో.

ఆ వ్యక్తి డిక్కీ తెరిచిన కారు నెంబరు, మోటార్ సైకిలు నెంబరు నోట్ చేసుకొన్నాడు సీతాపతి.

7

తన రివాల్వింగ్ ఛెయిర్‌లో వెనక్కి వాలి డి. ఎస్. పి. రంగనాథరావు చెప్పిందంతా నిశ్శబ్దంగా విన్నాడు ఎస్. పి. సుందర్రామ్.

రెండు క్షణాలు పోయాక, ముందుకు వంగి నిటారుగా కూచున్నాడు. టేబిలుమీద వ్రేళ్ళు అల్లుకొన్న అతని చేతులు, అర్ధచంద్రాకృతిగా మారాయి.

“నీ ఐడియాస్ యేమిటి? ఈ కేసు విషయంలో” అన్నాడు తాపీగా, ఆలోచనల్లోంచి తేరుకుని.

“ఈ రిజిస్ట్రేషన్ నెంబర్లున్న వాహనాలు యెవరివో తెలుసుకుని, సాఫ్టు వైట్ రెస్టారెంట్ మీద, మోటర్ సైకిల్ వ్యక్తిమీద దాడిచేసి పట్టుకుంటాం,” చెప్పాడు రంగనాథరావు.

సుందర్రామ్ సన్నగా నవ్వాడు. పాలరాయికన్నా సాఫుగా నున్నగావున్న గెడ్డాన్ని, బట్టతలని ఓసారి తీరిగ్గా తడుముకున్నాడు.

"ఒకటి, మనం ఫేక్ నెంబరు ప్లేట్లతో వెళ్ళినట్టే, వాళ్ళూ రాలేదని గేరంటీ ఏమిటి?" అన్నాడు సీరియస్‌గా రంగనాథరావు కళ్ళల్లోకి చూసి.

"నెంబర్లు చెక్ చేస్తే ఆ సంగతి తెలిసిపోతుందిగా" అన్నాడు రంగనాథరావు.

"ఓకే! తెలిసిపోతుంది. కాదనను. అదే...యింకో అమాయకుడి వాహనం నెంబరు తను తగిలించుకుంటే, ఆ అమాయకుడు అన్యాయంగా శిక్షింపబడడా?" అన్నాడు సుందర్రామ్.

రంగనాథరావు నిరుత్సాహపడ్డాడు.

"డోంట్ గెట్ డిజప్పాయింటెడ్! నేను చెప్పింది పాజిబిలిటీస్ గురించి. అయితే, నేను చెప్పేదేమంటే, మనం మరీ తొందరపడి చర్య తీసుకోకూడదు. రేపొద్దున్న వీళ్ళందర్నీ అరెస్టుచేసి కోర్టులో నిలబెడితే, వాళ్ళు చచ్చినా కాదనలేని, తిరుగులేని ఎవిడెన్స్ మెటీరియల్ ముందు సంపాయించాలి," అన్నాడు మృదువుగా.

"అయితే, యిప్పుడు యేం చేద్దామంటారు సార్?" అన్నాడు రంగనాథరావు నెమ్మదిగా.

"నువ్వు చెప్పినట్టుగానే, ముందు, ఆ నెంబర్లు ఎవరివో కనుక్కో. ఆ వ్యక్తులు డ్రగ్స్‌తో సంబంధం వున్న వాళ్ళని తేలితే, వాళ్ళు వెళ్ళే స్థలాలు, కలిసే మనుషులు వగైరా వివరాలన్నీ సేకరించాలి. ఈలోపున సాఫ్ట్ లైట్ రెస్టారెంట్‌ని దర్శించే మనుషులందర్నీ ఫిల్మ్ తీసి, వాళ్ళ

వివరాలు సంపాయించు. ఆ తరువాత చెయ్యాల్సిందేమిటో చెప్తాను.''

''ఓకే! అలాగే సార్!'' అంటూ లేచి బయటకు కదిలాడు రంగనాథరావు.

8

సాఫ్ట్ వైట్ బార్ అండ్ రెస్టారెంట్ మూడవ అంతస్తులో దాని ప్రొప్రయిటర్ నూకరాజుకు ఓ ప్రైవేటు రూం వుంది. అది ఫుల్లీ ఎయిర్ కండిషన్డ్. వెల్ ఫర్నిష్డ్.

రోజూలో ఇరవై గంటలు రెస్టారెంట్ తెరిచివుంటుంది. అందులో సుమారు పదహారు గంటలు నూకరాజు రెస్టారెంటులోనే వుంటాడు. మిగతా నాలుగు గంటలు, రెస్టారెంట్ని మేనేజరు రంజిత్కు అప్పజెప్పి, అప్పుడయినా, అర్జంటు పనులుంటే తన బంగ్లాకు ఫోను చెయ్యమని చెప్పి మరీ వెళ్తాడు.

అయితే, ఉన్న ఆ పదహారు గంటల్లో, ఎక్కువసేపు తనకంటూ పెద్దగా పని వుండదు. అలాగని యింటికి పోతే, రెస్టారెంట్ నిర్వహణ కుంటుబడుతుందని నూకరాజుకు తెలుసు. అందుకే రెస్టారెంట్లో పచార్లు చెయ్యాని సమయాల్లో, తన ప్రైవేట్ రూంకి పోయి కూచుంటాడు.

ఆవాళ ఉదయం ఎనిమిది గంటలకు రెస్టారెంట్కు వస్తూ, రోడ్డుమీద బ్రేక్ డౌను అయి నిలిచివున్న ఆంధ్రా మెరైన్ ప్రోడక్ట్స్ వారి వెహికిల్ని చూసాడు.

అది, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత, నూకరాజు తనగదికి పోయి ఒక కునుకు తీద్దామని వెళ్ళినపుడుకూడా, యింకా అక్కడే వుంది.

మేడమీది తన గదిలోంచి చూస్తుంటే, ఆ వాహనం

అలా ఆగడంలో ఏదో ప్రత్యేకత వుందనుకున్నాడు నూకరాజు.

చకచకా డెస్క్‌లోంచి బైనాక్యులర్స్ తీసి, ఆ వెహికిల్ మీద కేంద్రీకరించాడు.

ఆ వెహికిల్ తన రెస్టారెంట్ ముఖద్వారానికి యెదురుగా ఆగి వుంది. దాని వెనుక బాడీ అంతా పెట్టెలా మూసేసి వున్నా, పైన చిన్న చిన్న కన్నాలున్నాయి, గాలి పోవడానికి.

అంతేకాదు. తన రెస్టారెంట్ వైపున్న భాగంవైపు, లోన వెలుతురు రావడానికి అన్నట్టుగా, ఓ గ్లాసు ఫ్రేము వుంది.

అది నిజంగా మెరైన్ ప్రోడక్ట్స్ తీసుకెళ్ళే వాహనమైతే బాడీకి అన్నివైపులా పెట్టెలాగు మూసివుంటుంది గాని, పైన కన్నాలున్న సీలింగ్, ప్రక్కన గ్లాసు ఫ్రేములు వున్నాయేం?

గ్లాసుఫ్రేము ఉన్నచోట బైనాక్యులర్స్ కేంద్రీకరించి, వ్యూ మేగ్జిమమ్ కనిపించేలా అమర్చి చూసాడు నిశితంగా.

గ్లాసుఫ్రేములోని గ్లాసు ఉండుండి ప్రక్కకు తప్పుకుంటోంది. తప్పుకున్నప్పుడు అక్కడ నల్లని గుండ్రని మూతిగలదేదో వున్నట్టూ, దాన్నెవరో కదిలిస్తున్నట్టూ, అగపడుతోంది.

ఓ మైగాడ్! తన రెస్టారెంట్‌కు వచ్చే కస్టమర్స్‌ని ఫిల్మ్ తీస్తున్నారు ఎవరో!...ఎవరో యేమిటి? పోలీసులే అయ్యుండాలి.

నూకరాజుకు ఒక్కసారిగా రక్తపుపోటు యెక్కువైపోయింది.

వెంటనే మేనేజరు కౌంటర్ దగ్గర గంటమ్రోగే బజ్జర్ నొక్కాడు.

అయిదు నిముషాల్లో మేనేజర్ రంజిత్ అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

"మనం యిప్పుడు ఓ బాంబ్ మీద కూచున్నాం. నువ్వో ఓసారి చూడు" అంటూ బైనాక్యులర్స్ రంజిత్ కు అందించి, రోడ్డుకు అవతలవైపు, తమ రెస్టారెంట్ కు ఎదురుగా నిలిచివున్న వాహనంవైపు వేలితో చూపాడు నూకరాజు.

బైనాక్యులర్స్ అందుకుని రెండు నిముషాలసేపు యజమాని చూపిన వెహికిల్ వైపు చూసి, "మీ రూహించింది నిజమే సార్! మొన్న మన ఖాతాదారు రమాకాంత్ సరుకు పట్టుకెళ్ళినపుడు తనని ఎవరో వాచ్ చేసారని గోల పెట్టాడు, మర్నాడు నా దగ్గరకొచ్చి" అన్నాడు రంజిత్.

"యూ ఫూల్! ఆ విషయం నాతో చెప్పలేదేం?" అన్నాడు నూకరాజు మండిపోయి.

"అవును సార్! చెప్పలేదు. మనవాళ్ళు ఒక్కోసారి వాళ్ళ నీడను చూసికూడా జడుసుకుంటారు సార్. అందుకే చెప్పలేదు. అయినా పరిస్థితి చెయ్యి దాటి పోలేదు. కాబట్టి యేం చెయ్యమంటారో చెప్పండి" అన్నాడు రంజిత్.

"క్షణంగూడాఆలస్యం చెయ్యకుండా మనవాళ్ళందరికీ, ఎలారమ్ సిగ్నల్స్ పంపించు. వాళ్ళ మువ్ మెంట్స్ ఆపొద్దని చెప్పు. కాని, యీ వ్యవహారాలు పూర్తిగా నిలిపెయ్యమని చెప్పు" అరిచాడు నూకరాజు.

పరుగులాంటి నడకతో బయటికి నడిచాడు మేనేజరు రంజిత్, యజమాని ఆర్డర్స్ అమలు జరపడానికి.

9

పోలీసు హెడ్ క్వార్టర్స్ రెండో అంతస్తులో ఓ మూలగా వున్న డార్క్ రూం అది.

పదిరోజులుగా స్కాఫ్ వైట్ రెస్టారెంట్‌కు వచ్చిన వ్యక్తులపై తీసిన ఫిల్మ్ స్క్రీన్ చెయ్యబడుతోంది.

ఆ రూంలో ఎస్. పీ. సుందర్రామ్, డి. ఎస్. పి. రంగ నాథరావు, ఫిల్మింగ్ చేసిన ఇద్దరు ఇంటెలిజెంస్ ఆఫీసర్లు, సబిన్స్పెక్టరు సీతాపతి, ప్రొజెక్టర్ ఆపరేటర్ వున్నారు.

తెరమీద అవుపించేవాళ్ళల్లో పాత కేడీలు ఎవరెవ రున్నారు, ఉంటే వారిమీద నిఘా వుంచాలా, అక్కర్లేదా, కొత్తవాళ్ళల్లో ఎవరెవరు అనుమానాస్పదంగా అవుపిస్తున్నారు? వారిలో ఎవరిమీద నిఘా వుంచాలి వగైరా విషయాలు సుందర్రామ్, సీతాపతి రికార్డ్స్ చూసి చెప్పే ఫోటోల ఆధారంగా చెబుతుంటే, నోట్ చేసు కుంటున్నాడు రంగనాథరావు.

సుమారు నాలుగు గంటలు ఏకబిగిన సాగింది ఆ సమా వేశం.

ఆ తరువాత రెస్టారెంటులో మారుమూలల రహస్యంగా పోలీసు డిపార్టుమెంటు అమర్చిన బగ్గింగ్ యెపేరటస్ అందించిన టేప్స్‌లోని సమాచారం వినడం మొదలైంది.

టేపు తరువాత టేపు అయిపోతోంది గాని, తమకు కావాల్సిన సమాచారం రవంత చిక్కలేదు.

"వాట్ హేపెన్డ్ మై డియర్ ఫ్రెండ్?" ఆఖరి టేపు వినడం అయ్యాక ఎర్రబడిన మొహంతో అరిచాడు సుందర్రామ్, రంగనాథరావు నుద్దేశించి.

పులిని చూసిన లేడిలా వణికిపోసాగాడు రంగనాథ రావు.

"అదే నా కర్మం గావడంలేదు సార్!" అన్నాడు ఎలాగో వణికే కంఠంతో.

"అంటే, మనం వాళ్ళమీద నిఘా పెట్టినట్టు మళ్ళా మనల్ని మనం బైట పెట్టుకున్నామన్న మాట?" పిచ్చిగా అరిచాడు ఎస్. పి. సుందర్రామ్.

"ఏర్పాట్లన్నీ పక్కాగా చేసాం సార్! మనవాళ్ళు ఒక్క తప్పుగూడా చెయ్యలేదు. బగ్గింగ్ యెపేరటస్ కూడా రాత్రిపూట, రెస్టారెంటు మూసివున్న సమయంలో మనవాళ్ళు లోనకు చొరబడి చాలా జాగ్రత్తగా ఫిక్స్ చేసారు" దడదడలాడిపోతున్న గుండెల్ని ఎలాగో చిక్కబట్టుకుని అన్నాడు రంగనాథరావు.

"అంతే సార్!...అంతే సార్!" వంత పలికారు, ఇంటెలిజెన్స్ ఆఫీసర్లు, సబిన్స్పెక్టరు సీతాపతీ.

"ఏమిటి లాభం? ... ఆపరేషన్ సక్సెస్‌ఫుల్ బట్ పేషెంట్ డైడ్" గదిలో పచార్లు మొదలుపెట్టాడు విసురుగా సుందర్రామ్.

పావుగంట - అరగంట - గడిచింది.

సుందర్రామ్ అలా తిరుగుతున్నాడంటే, యేదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడని అర్థమవుతోంది.

నిస్సహాయంగా ఎస్. పి. సుందర్రామ్ వైపు చూస్తూ నిలుచున్నారు అందరూ.

ఇంకో పావుగంట గడిచింది.

సుందర్రామ్ ఆలోచనల్లోంచి తేరుకొన్నాడు. టకీమని పచార్లు కట్టిపెట్టాడు.

"నూకరాజు, అతని ఖాతాదారు రమాకాంత్ మువ్‌మెంట్సు వాచ్ చెయ్యించండి. తతిమ్మా ఆపరేషన్స్ అన్నీ సస్పెండ్ చెయ్యండి," అంటూ ఆర్డర్సు వేసి చివా

లున బయటకు వెళ్ళిపోయాడు తలుపు తోసుకుని.

ఉరుము ఉరిమి, వాన కురిసి వెలిసినట్టయింది, అక్కడున్నవా రందరికీ. పెద్ద నిట్టూర్పు విడిచారు, సుందరాామ్ వెళ్ళిపోగానే.

10

ఎస్. పీ. తీసుకొన్న నిర్ణయం ప్రకారం అన్ని ఆపరేషన్స్ సస్పెండ్ చెయ్యబడ్డాయి. కాని, నూకరాజు, రమాకాంత్ లమీద మాత్రం నిఘా వుంచబడింది.

అయితే, పోలీసు డిపార్టుమెంట్ ఊహాల్ని, అంచనాల్ని పూర్తిగా తల్లక్రిందులు చేసే సంఘటన ఒకటి జరిగింది.

పదిరోజులు తిరగకుండానే, సాఫ్టు వైట్ బార్ అండ్ రెస్టారెంటు మూతబడింది. కారణం! సుమారు రెండు లక్షల విలువచేసే నగదు పట్టుకుని, రెస్టారెంటులో పని చేసేవా డొకడు రాత్రికి రాత్రి ఎక్కడికో ఉడాయించాడట.

వాడ్ని పట్టుకోమనీ, తన డబ్బు తన కిప్పించమనీ, ఆ డబ్బు పోవడంతో, తన జీవనాధారం అయిన రెస్టారెంటు మూతబడిందనీ ఓ కంప్లెయింటు యిచ్చాడు నూకరాజు పోలీసులకు.

ఆ తరువాత మనశ్శాంతికోసం బదరీనాథ్, హరిద్వార్ వగైరా ఉత్తరదేశ యాత్రలకు వెళ్ళిపోయాడు.

దాంతో డ్రగ్ ట్రాఫిక్ కేసులో పోలీసులకు మిగిలిన ఒకే ఒక్క లింకు రమాకాంత్, వారం తిరక్కుండానే అతను హత్య చేయబడ్డాడు.

సాఫ్టు వైట్ అండ్ రెస్టారెంట్ మూత బడిందనీ, దాని యజమాని నూకరాజు ఉత్తరాది యాత్రలకు వెళ్ళి

పోయాడనీ, రమాకాంత్ అతని గదిలో చచ్చిపడి వున్నాడనీ - రంగనాథరావు యిచ్చిన రిపోర్టు - ఎస్. పీ సుందర్రామ్‌కు కోపం తెప్పించలేదు సరిగదా, ఫెళ్ళున నవ్వసాగాడు, విరగబడి.

ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెట్టాడు రంగనాథరావు.

"మన ప్లాన్స్ అన్నీ అప్సెట్ అయ్యాయనీ మేమంతా కంగారు పడుతుంటే, మీరు నవ్వుతారేమిటి సార్?" అనేసాడు ధైర్యంగా రంగనాథరావు.

"అడిగావా?... అడుగుతావని నాకు తెలుసులే" అని ఆగి ఒక్క క్షణం మౌనం వహించి "మనం వెంటాడుతున్నది కరెక్టు గేంగే అని యిప్పుడు రుజువయ్యింది." అన్నాడు సుందర్రమ్.

- "అయితే, నూకరాజు ఎక్కడ కనిపించినా అరెస్టు చెయ్యమని దేశమంతటా ఆర్డర్స్ ట్రాన్స్‌మిట్ చేద్దామంటారా?" అడిగాడు రంగనాథరావు ఉత్సాహంతో.

"నో! నో!... ఆ తొందరే వద్దని నేను మొదట్నించీ చెబుతున్నది. ప్రాబ్లమ్ నువ్వనుకున్నంత సింపుల్ కాదు... మనం వలవేసాం చేపలకోసం...మనం వల వేసినట్టు చేపలు గ్రహించి తప్పుకున్నాయి... ఇప్పుడు మనం చెయ్యాల్సింది "ఒక ధ్యానం"... అంటే, మనం చల్లబడి పోయామని డ్రగ్ ట్రాఫికర్స్ అనుకుని మళ్ళా వ్యాపారాలు తిరిగి ఆరంభించేదాక మనం రెస్టు తీసుకోవాలి. కాని అప్రమత్తులమై ఉండాలి" వివరించాడు సుందర్రామ్.

"అంటే మీ ఉద్దేశంలో నూకరాజు అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్ళిపోయాడనీ, డబ్బు తీసుకుని పనివాడు పరారయి

పోయాడన్నది రెస్టారెంట్ మూసెయ్యడానికి తయారు చేసిన నాటకం అనీ, రమాకాంత్ పోలీసులకు చిక్కి, తమ రహస్యాలు యెక్కడ వెళ్ళగక్కేస్తాడో అని, అతడ్ని అంతం చేశారనీ అంటారు'' అన్నాడు రంగనాథరావు.

''రైట్!... చాలా రోజుల తర్వాత నా వ్యూహాల్ని కరెక్టుగా గ్రహించావు. యూ ఆర్ పికింగప్ వెల్!'' అంటూ రంగనాథరావుకు ఓ మెచ్చుకోలు పారేసాడు సుందర్రామ్.

చాలా అరుదుగా తన సబార్డినేట్స్ని మెచ్చుకుంటాడు సుందర్రామ్ అని రంగనాథరావుకు తెలుసు.

''అయితే ప్రస్తుతం మన కర్తవ్యం యేమిటి?''

''యేముంది సిట్ అండ్ రిలాక్స్... చేతులు ముడుచుకుని కూచున్నట్టు మనం అవుపించాలి... అంతే! లెటజ్ డిస్పర్స్'' అన్నాడు సుందర్రామ్.

11

ఇంచు మించు సంవత్సరం గడిచి పోయింది. పోలీసు డిపార్టుమెంటు మత్తుమందు వ్యాపారస్తుల విషయం పూర్తిగా మరిచిపోయినట్టే ప్రవర్తింప సాగింది.

కొన్నాళ్ళపాటు హిరోయిన్ వ్యాపారం పూర్తిగా అంతరించి పోయినట్టు అవుపించింది. కాని, ఆ తరువాత మెల్లగా మొదలై వేగం పుంజుకోసాగింది.

వాత్తేరు ఆప్ లాండ్స్లో హోటల్ విశ్రాంతి అనే కొత్త హోటలు వెలిసింది. రుచికరమైన భోజనానికీ, తృప్తికరమైన సదుపాయాలకీ, అందమైన కేబెరా డాన్సులకీ నెల తిరగకుండానే పేరు సంపాయించుకుంది ఊర్లో.

ఆ హోటలు యాజమాన్యం నూకరాజు చేతిలో లేదు. కాని, రంజిత్ మాత్రం, పూర్వపు అనుభవం దృష్ట్యా ఆ హోటలుకు మేనేజరుగా నియమింపబడ్డాడు.

అయితే, ఆ హోటలుకి అప్పుడప్పుడు నూకరాజు వస్తూ పోతున్నట్టు, ఒకరిద్దరి పోలీసాఫీసర్ల కంటబడింది. ఆ వార్త ఎస్. పీ. సుందర్రామ్ కూ డా అందజేయ బడింది.

"ఇంకా కొన్నాళ్ళు ఆగండి. చేపల్ని ధైర్యంగా పైకి తేలి నిర్విచారంగా యీదనివ్వండి. అప్పుడు చూసు కొందాం" అన్నాడు సుందర్రామ్.

నూకరాజు యిప్పుడు మునుపటి నూకరాజు కాదు. ఒక నాడు నూటల్లో తప్ప అవుపించని వ్యక్తి యిప్పుడు పూర్తిగా మారిపోయాడు. ఆధ్యాత్మిక జీవితం వైపు ఆసక్తి పెరిగినట్టుంది, కాషాయరంగు బట్టల్లో తప్ప కని పించడంలేదు. మెడలో రుద్రాక్ష తావళం గెడ్డాలు, మీసాలు యేపుగా పెంచుకొన్నాడు.

పచ్చని ఒంటి రంగు, కాంతి వంతమైన పెద్ద కళ్ళు, పొడవుగా, సన్నగా ఉండి కొనదేలిన ముక్కు, గుండ్రని నున్నని బుగ్గలతో ఉన్న నూకరాజుకి కొత్త వేషధారణ, ఎంతో ఠీవి, దర్జా, హుందాతనం చేకూర్చాయి.

ఇప్పుడు నూకరాజు దినంలో మూడొంతులు దేవాల యాల్లో గడపడం, సాధువులు, బాబాలు, యోగులూ యిచ్చే ఉపన్యాసాలకు హాజరు కావడం చేస్తున్నాడు.

అందరూ సహకరిస్తే, దైవం అనుకూలిస్తే, త్వరలో ఓ రామాలయం కట్టించడానికి తాను సంకల్పించుకొన్నా ననీ, అందరికీ చెప్తూ, తన పాత స్నేహితుల దగ్గర

అప్పుడప్పుడు చంద్దాలు వసూలు చెయ్యసాగాడు. అవన్నీ పోలీసు డిపార్టుమెంటు జాగ్రత్తగా గమనిస్తూనే వుంది.

"మిమ్మల్నో వ్యక్తి అర్జంటుగా చూడాలంటున్నాడు. మీతో తప్ప యింకెవరితోనూ మాట్లాడడట," చెప్పాడు రంగనాధరావు.

"సెండ్ హిమ్ ఇన్..." అన్నాడు ఎస్. పి. సుందర్రామ్.

"అలాగే సార్!" అంటూ బయటికి నడిచాడు రంగనాధరావు.

అయిదు నిముషాలు నడిచాక, అప్పుడే కొట్టితెచ్చిన మాంసం ముక్కలా ఎర్రగా, పొట్టిగా, లావుగా, పెద్ద బొజ్జతో ఉన్న సుమారు నలభై యేళ్ళున్న వ్యక్తిని వెంట బెట్టుకుని, ఎస్. పి. ఛాంబరులోకి వచ్చాడు రంగనాధ రావు. ఆ వెనుక సబిన్స్పెక్టరు సీతాపతి వచ్చాడు.

నలిగిన బట్టలు, చెదరిన జుత్తు, బెదురుచూపులతో వచ్చిన నూతన వ్యక్తిని ఎగా దిగా చూసి "ఏం? ఎందుకూ?... నాతో మాట్లాడాలన్నారుట?" అన్నాడు సుందర్రామ్ కొంచెం కటువుగా.

"సార్! దయచేసి నన్ను కూర్చోనియ్యండి...మీతో చాలా విషయాలు మాటాడాల్సి ఉంది," చెప్పాడు ఆ వ్యక్తి ఏడుపుతో బొంగురు పోయిన గొంతుకతో.

అవతలి వ్యక్తి అంతులేని దుఃఖంలో ఉన్నాడని గ్రహించిన సుందర్రామ్ క్షణంలో కరిగి పోయాడు.

"తప్పకుండా! తప్పకుండా! కూచోండి" అంటూ తన ఎదుటి కుర్చీ ఆఫర్ చేసాడు.

ఆ వ్యక్తి కుర్చీలో కూలబడుతూనే, చేతుల్లో మొహం దాచుకుని యేడవ సాగాడు.

అతన్ని సుందర్రామ్ ఓదార్చ ప్రయత్నించలేదు. దుఃఖాన్ని నిగ్రహించుకోవడంకన్నా, బయటకు కన్నీటి రూపంలో రానివ్వడమే నరాలకు మంచిదని శాస్త్రజ్ఞులు చెప్పినట్టు చాలా పుస్తకాల్లో చదివాడు సుందర్రామ్.

సీతాపతి నూతన వ్యక్తికి వెనకాల నిలున్నాడు గార్డ్ చేస్తున్నట్టుగా.

రెండు క్షణాలు పోయాక ఆ వ్యక్తే, తనను తాను నిగ్రహించుకొని "క్షమించండి సార్!... ఆపుకోలేక పోయాను" అంటూ క్షమాపణలు చెప్పుకొన్నాడు.

"ముందు...మీ పేరేమిటో. మీ కెవరో...వగైరా చెప్పి, ఆ తరువాత మీరు చెప్పదల్చుకొన్నది చెప్పండి" అన్నాడు ఎస్. పి. సుందర్రామ్.

"చెప్తాను సార్! చెప్తాను...అందుకేగా వచ్చింది. నా పేరు చిన్ని అంటారండి...యూనివర్సిటీ ఏరియాలో చిన్ని దుకాణం అంటే తెలియని వారుండరండి... నేను మీ కిప్పుడు చెప్పబోయేది...చాలా ప్రమాదకరమైంది...మీరు నన్ను కాపాడతారని మాటిస్తేగాని లాభం లేదండి," అని ఆగి గట్టిగా ఊపిరి పీల్చాడు.

అతడికి బ్రీదింగ్ ట్రబుల్ ఉందనీ, ఏకబిగిన మాటాడ లేడనీ అర్థం చేసుకొన్నాడు సుందర్రామ్.

"అలానే! తప్పకుండా!... చెప్పండి" అంటూ సుందర్రామ్ హామీ యివ్వగానే, మొదలు పెట్టాడు మళ్లా చిన్ని.

"నేను పచుడరు వ్యాపారం చేస్తుంటానండి"

"అంటే?..." చిన్ని మాటను కట్ చేస్తూ అడిగాడు సుందర్రామ్.

"అదేనండిం...హిరోయిన్...యూనివర్సిటీ స్టూడెంట్లందరికీ నేనే సప్లయి చేస్తానండి," వివరించాడు చిన్ని.

ఆ విషయం వినగానే, అక్కడున్న అందరి ముఖాలు ఒక్కసారిగా వెలిగాయి.

"ఆ కేసు యెప్పుడో మూసేసామే... ఆ వివరాలెందుకు చెప్తున్నారు మాకు?" నైస్‌గా అబద్ధ మాడాడు సుందర్రామ్.

"సార్! నాకు రోజులు దగ్గర పడ్డాయండి...నన్ను వాళ్లు చంపేస్తారు...మీరు రక్షిస్తారన్న కొండంత ఆశతో వచ్చాను" చేతులు జోడించి నమస్కరిస్తూ అన్నాడు చిన్ని.

"వాళ్ళు అంటున్నావు...యెవరు వాళ్ళు?"

"నూకరాజు, రామశర్మ... యీ వ్యాపారానికి వాళ్ళి మూలవిరాట్టులు అంటారు."

"రామశర్మ యెవరు?" అడిగాడు సుందర్రామ్. కొత్త పేరు చెవిన పడగానే.

"నూకరాజుకు కుడిభుజం...విజయవాడలో ఆపరేట్ చేస్తుంటాడు."

"ఇంతకూ నూకరాజు యెక్కడ్నించి తెస్తున్నాడు యింతపాటి సరుకు?"

"హిరోయిన్ నల్లమందు నుంచి తయారవుతుందని మీకు తెలుసను కుంటాను...నల్లమందు మనకు దగ్గరలో నేపాల్ నుంచి బాగా దొరుకుతుంది. ఇంతకుముందు నేపాల్‌లోనే హిరోయిన్ తయారై మన దేశం వచ్చేది. కాని, లేబరేటరీ యిక్కడే ఆంధ్రదేశంలోనే వుందట యిప్పుడు."

"ఓ మైగాడ్!"

చిన్ని మాటలు వింటూనే ముగ్గురు పోలీసాఫీసర్లు ఒకే సారి అన్నారు, తమ ఆశ్చర్యాన్ని కప్పిపిచ్చుకోలేక.

"అందుకే నన్నుమాట...అంత విస్తారంగా దొరుకు తోంది యిప్పుడు ఆంధ్రదేశంలో" అన్నాడు సుంద్రరామ్ ఆశ్చర్యంనుంచి తేరుకుని.

"అంతేకాదు సార్!... మనవాళ్ళు మిగతా రాష్ట్రాలకు సప్లయి చేయాలన్న తలంపుతో ఉన్నారు."

"ఇన్ని వివరాలు మీ కెలా తెలాసు?"

"మొదట నేను నేపాల్ నుంచి నల్లమందు స్మగ్లింగ్ చేసే గేంగ్ లో ఉండేవాడ్ని. యీ బ్రీదింగ్ ట్రబుల్ మొదలవడంతో, తిరుగుళ్ళు చాలా కష్టమనిపించింది. చిల్లర వ్యాపారం చేయగా వచ్చేది చాలని ఊరుకున్నాను. ఈ వ్యాపారంలో కాస్త పాత పిల్లినేమో, చాలామందిని నాకు తెలుసు."

"ఇంతకూ వాళ్ళు నిన్నెందుకు చంపాలను కుంటున్నారు?"

"యేముంది సార్!...యెవడో ఆకాశరామన్న ఉత్తరం రాసాడు నూకరాజుకి. 'నీ వ్యాపారం గురించి యేవత్తు తెలిసిన మీలోవాడే పోలీసులకు చెప్పేసాడు జాగ్రత్తగా ఉండండి' అంటూ. దానితో నూకరాజు తన ఆరాలు ఆరంభించాడు. ఎందుకు అనుమానించాడో తెలీదుగాని, చంపడానికి నన్ను మార్కు చేసినట్టుగా, నాకోతెషి ఒకడు వార్త అందించాడు."

"పోలీసులకు నేనేం చెప్పలేదంటూ వెళ్ళి మీ బాస్ తో చెప్పలేక పోయారా?"

"సార్! యీ వ్యాపారం చేసే మనుషుల సంగతి

మీకు తెలీదుసార్. రమాకాంత్ వెనకాల మీరు పడ్డా రని తెలియగానే, దొరికితే, అతనేం రహస్యాలు బయటికి కక్కేస్తాడో అని అతడ్ని చంపేసారు వాళ్ళు, ఇహ నా విషయంలో వాళ్ళకు తిరుగులేని అనుమానం కలిగింది. నేను వెళ్ళి అడిగితే, నా మీదున్న అనుమానం బలపడ్డమే గాకుండా, నాకు సమాచారం అందించిన వాడొకడున్నా డని గ్రహించి, వాడ్ని కనిపెట్టి వాడ్నికూడా చంపు తారు."

సుందర్రామ్ గుండె దిగులుతో బరువెక్కింది డ్రగ్ బిజినెస్‌లోని మనుషుల కర్కోటకతనం అర్థమై.

"అయితే, మీ కెలాంటి రక్షణ కావాలంటారు?"

"వెంటనే నన్ను అరెస్టు చెయ్యండి. లాకప్పులో పెట్టండి. నాకు బయటకన్న జైలే నయం... కొన్నాళ్ళు బ్రతుకుతాను అలాగయినా" అన్నాడు చిన్ని ఆవేశంగా.

"మిమ్మల్ని అరెస్ట్ చెయ్యడం కుదరదిప్పుడు. మీకు రక్షణ ఏర్పాటు చేస్తాము. మీ మీద వాళ్ళు పడబోతా రన్నప్పుడు వాళ్ళను పట్టుకొంటాం. నిన్ను అరెస్టుచేస్తే మిగతా వాళ్ళు మా చెయ్యి జారిపోతారు. కాబట్టి యెప్ప టిలా మీ పనిలో ఉండండి," చెప్పాడు సుందర్రామ్.

"లేదు సార్!... నేను బయటకు వెళితే బతకను" మళ్ళా ఏడవసాగాడు చిన్ని.

"మీ ప్రాణానికి నా ప్రాణం మిస్టర్ చిన్నీ... వెళ్ళండి...మామాట మీద నమ్మకం ఉంచండి" అంటూ సుందర్రామ్ లేచి చిన్ని బుజం తట్టి ధైర్యం చెప్పేంత వరకు చిన్ని శాంత బడలేదు. అప్పుడుగాని, మామూ లుగా ఊరిలో తిరుగాడ్డానికి ఒప్పుకోలేదు.

"సీతాపతీ!" సుందర్రామ్ పిలిచాడు.

అంతవరకూ చెక్కినశిల్పంలా ఎటెన్షన్‌లో నిలుచున్న సీతాపతిలో చలనం కనిపించింది. "యస్ సార్!" అన్నాడు.

"చిన్నిని నీ ఆఫీసు రూంకి తీసుకెళ్ళు. స్టేట్‌మెంట్స్ తీసుకో" అని ఆర్డరిచ్చి "మిస్టర్ చిన్నీ!...మీ సాయం కావాలి...సీతాపతి అడిగే స్టేట్‌మెంట్సు యివ్వండి" అన్నాడు సుందర్రామ్, చిన్ని వైపుకు మళ్ళీ తిరిగి.

చిన్ని తలూపి లేవగానే, సీతాపతి అతన్ని వెంట బెట్టుకుని వెళ్ళిపోయాడు బయటికి.

వాళ్ళలా వెళ్ళిపోగానే "నూకరాజు మీద ఆ ట్రిక్ ప్లే చేసింది యెవరంటావ్?" అడిగాడు సుందర్రామ్, రంగనాథరావుని.

రంగనాథరావు మాటాడలేదు. కాని, యేదో చెప్ప దలుచుకున్నట్టు అవుపించాడు.

"నీ మనసులో యేదో ఉంది. చెప్పేయ్. సందేహించక" అన్నాడు సుందర్రామ్, రంగనాథరావు మనోస్థితి అర్థమై.

"నేనే సార్ ఆ ఉత్తరం రాసింది" చెప్పేసాడు రంగనాథరావు.

"వాట్?" నోరు తెరుచుకుని ఆశ్చర్యంతో ఉండి పోయాడు సుందర్రామ్.

"అవును సార్!...మీతో ముందుగా చెప్పలేదు. నా ట్రిక్ పని చేస్తుందో లేదో చూసాక చెప్పవచ్చునని ఊరుకొన్నాను...ఒకసారి అమెరికాలో అపరేట్ చేసే రష్యన్ గూఢచారుల్ని కలవర పెట్టడానికి, అమెరికా

యిలాంటి ట్రిక్కే ప్రయోగించింది. రష్యాలోఉన్న తమ గూఢచారి, అమెరికాలో అపరేటు చేసే రష్యన్ గూఢ చారుల వివరాలన్నీ సేకరించి తెలియజేసినట్టుగా ప్రక టించింది...

అది టైమ్ మేగజైన్‌లో చదివాక నాకీ ఆలోచన వచ్చింది...ఎంత చేసినా మన దర్యాప్తు ఒక్క అంగుళం ముందుకు సాగడంలేదు... ఒక్క ఆకాశరామన్న ఉత్తరం రాస్తే - వాళ్ళల్లో వాళ్ళకి ఒకరి మీద ఒకరికి అపనమ్మ కాలు యేర్పడి, అనుమానాలు మొదలై, చివరకు ఎవరో ఒకరు అన్నీ తెలిసినవాడు పోలీసుల రక్షణకోసం వస్తా డని వూహించాను.'' చెప్పాడు రంగనాథరావు.

''యూ హేవ్ టేకెన్ టూమచ్ రిస్క్!...యూనో దట్?'' అన్నాడు సుందర్రామ్.

''కాని. అందుకు సిద్ధపడే సాహసించాను'' సిర చిత్తంతో అన్నాడు రంగనాథరావు.

''దెన్ యూ టేకోవర్ ఎంటైర్ ఆపరేషన్!''

''యస్ సార్! ఇఫ్ యూ పెర్మిట్ మీ!'' సవాలు అందుకున్నట్టుగా అన్నాడు రంగనాథరావు.

''ఓకే దెన్!...కేరీ ఆన్!...బెస్టాఫ్ లక్'' అన్నాడు సుందర్రామ్ తన చెయ్యి ముందుకు చూచి.

''థేంక్యూ!...థేంక్యూ వెరీమచ్!''

సుందర్రామ్ చెయ్యి అందుకోలేదు రంగనాథరావు. గౌరవంగా, వినయంగా తలవంచి, ఎటెన్షన్‌లో నిలబడి అన్నాడు.

12

చిన్ని యిచ్చిన స్టేట్‌మెంటు ప్రకారం, ఆంధ్ర దేశంలో సాగుతున్న హిరోయిన్ వ్యాపారానికి మూల

విరాట్టులు ఇద్దరు. ఒకరు నూకరాజు, రెండోవాడు మొట్ట మొదటిసారిగా పోలీసు డిపార్టుమెంటు తోటిసుకు వచ్చిన రామశర్మ.

రామశర్మ విజయవాడనుంచి ఆపరేట్ చేస్తుండడం వల్ల కాకోలు, విశాఖలో యింతవరకూ సాగిన దర్యాప్తులో, అతనిసంగతి బయటపడలేదు.

అయినా, వీరి ఇద్దరి గురించి తిరుగులేని సాక్ష్యాధారాలు సేకరించడానికి తీర్మానించుకున్నాడు రంగనాథరావు.

విజయవాడలో రామశర్మ గురించి ఎవిడెన్స్ సంపాయించడానికి, అక్కడి పోలీసుశాఖకి, తగిన ఆర్డర్స్ పంపాడు రహస్యంగా.

దీని కంతటికీ నూకరాజు చీఫ్ అని తెలుస్తోంది. అయితే, అతని అవతారం మార్పుకు, అంటే, కాషాయ వస్త్రాలు ధరించడానికి, ఊళ్ళోకి వచ్చే సాధుసన్యాసుల వెంట తిరగడానికి_యేదో గట్టి కారణం ఉండి ఉంటుంది అనుకున్నాడు రంగనాథరావు.

అయితే, యేమిటది?

నూకరాజు వేసే ప్రతి అడుగునీ పరిశీలించి రిపోర్టు చెయ్యడానికి, ఊరినిండా పోలీసాఫీసర్లని మారువేషాల్లో త్రిప్పాడు.

నూకరాజు హోటలు విశ్రాంతికి తరుచు వెళ్ళడం నిజమేగాని, అలా వెళ్ళడం అతని పాత స్నేహితుల్ని కలుసుకోవడానికి వెళ్తున్నట్టుగా ఉందిగాని, మత్తుమందు వ్యాపారంతో సంబంధం ఉన్నట్టుగా లేదు.

అలాగే, ఊరిలోని అతని కదలికల్ని ఎంత వాచ్ చేసి నప్పటికీ ఫలితం లేకపోయింది.

నూకరాజు కాషాయ గుడ్డల వేషం వెనుకఉన్న రహస్యాన్ని ఛేదించడానికి చివరకు సబిన్స్పెక్టరు సీతాపతిని నియమించాడు రంగనాథరావు.

ఆరునెలల కోసారయినా తిరుపతి వెళ్తాడు నూకరాజు. మూడునెలల కోసారయినా, బెజవాడ కనకదుర్గను చూసి వస్తేగాని ఉండలేడు అతడు. కనీసం రెండునెలల కోసారయినా, విశాఖపట్నానికి ముప్పై అయిదు మైళ్ళ దూరంలో పుణ్యగిరిలో ఉన్న ఈశ్వరానంద ఆశ్రమానికి వెళ్ళివస్తేగాని ఊరుకోడు.

నూకరాజుతో పాటుగ తిరుపతి, బెజవాడ వెళ్ళి వచ్చాడు సీతాపతి రహస్యంగా.

తన పార్టనర్ రామశర్మను కలిసి మాట్లాడ్డం తప్ప నూకరాజు ప్రవర్తనలో ప్రత్యేకత యేమీ కనపడలేదు సీతాపతికి, బెజవాడలో.

అయితే ఆ బ్రహ్మరహస్యమేదో, పుణ్యగిరి ట్రిప్ లోనే ఉండాలనుకున్నాడు.

అయితే, నూకరాజుతో వెళ్ళకుండా ఓసారి ముందు వెళ్ళి ఈశ్వరానంద ఆశ్రమాన్ని చూసివస్తే బావుంటుందనుకున్నాడు.

ఓ ఏకాదశి రోజున, యాత్రికులు దండిగా పుణ్యగిరి దర్శించే రోజున బయలుదేరి వెళ్ళాడు పుణ్యగిరికి.

పుట్టుధార, కోటిలింగాలు, దారప్పలోయల్లో స్నానం చేసాక "బాబా! ఇక్కడ ఈశ్వరానందగారి ఆశ్రమం ఉందట. యెక్కడండీ?" అని అడిగాడు సీతాపతి ఓ యాత్రికుడ్ని.

"పుట్టుధారకు పైన ఉందండి!" చెప్పాడు యాత్రికుడు.

"అంటే, నేను మళ్ళా వెనక్కి వెళ్ళాలా?" అడిగాడు సీతాపతి.

"అందరూ అలాగే వెళ్తారండి...మీరుకూడా అలాగే వెళ్ళండి" చెప్పాడు యాత్రికుడు.

ఈసురో మనుకుంటూ తిరిగి పుట్టుధార దగ్గరకు వెళ్ళాడు సీతాపతి. యాత్రికుడు చెప్పినట్టుగా పుట్టుధారకు పైకి రావడానికి ఓ దోవఉంది. కొంతమంది యాత్రికులు పైకి వెళ్తూ, కనిపించారు కూడా.

సీతాపతి కూడా వారు వెళ్తూవున్న దోవనే బయలుదేరాడు.

ఈశ్వరానంద ఆశ్రమం సుమారు వెయ్యి చదరపు గజాల జాగాలో చుట్టూ దట్టంగా పెరిగిన వృక్షసముదాయాల మధ్య, పూలమొక్కలమధ్య ఆదర్శవంతంగా కట్టబడి ఉంది.

ఆశ్రమం ప్రవేశించగానే, ఆ వాతావరణంలో జాలువారే ఆధ్యాత్మికత్వం, మనస్సుని పట్టేటట్టుగా ఉంది.

ఆశ్రమంలో ప్రవేశిస్తూ "ఒకనాడు నూకరాజు మత్తు మందుల వ్యాపారం చేసిన మాట నిజమేగాని యిప్పుడు నిజంగా మారిపోయాడేమో?...తను అనవసరంగా అతడ్ని అనుమానిస్తున్నాడేమో?" అనుకున్నాడు సీతాపతి.

ఆ భావన, ఆశ్రమంలోని యేర్పాట్లు చూసాక మరింత దృఢపడింది. వచ్చిన యాత్రికులకు ప్రసాదం పేరిట ఏదో ఓ పండు ఆశ్రమం యిస్తోందిగాని, యాత్రికులు యిచ్చేవేవీ బొత్తిగా పుచ్చుకోవడంలేదు.

ఈశ్వరానంద కుటీరంలోకి వెళ్ళాడు సీతాపతి.

ఒకరి తర్వాత ఒకరు స్వామివారికి నమస్కారాలు చేసి, ఆశీర్వాదాలు పొంది, వెళ్ళిపోతున్నారు.

సీతాపతికూడా మెల్లగా స్వామివారి దగ్గరకు వెళ్ళాడు. చేతులు మోడ్చి, సాష్టాంగ ప్రణామం చేసాడు. లేస్తూ, స్వామివారి మొహంలోకి చూసాడు.

మేలిమి బంగారు కాంతితో వెలిగిపోతోంది స్వామి వారి మొహం. ఒత్తుగా పెరిగిన కారునలుపు గడ్డాలు. మీసాలమధ్య ఆ మొహం, మబ్బులు ముసిరిన చంద మామలా ఉంది.

అయితే, అంత అందమైన చందమామలో మచ్చ ఉన్నట్టుగా, స్వామివారి పై పెదవిమీంచి దవడమీదకు ప్రాకిన ఓ గంటుఉంది.

స్వామివారి రూపాన్ని మనస్సులో నిక్షిప్తం చేసు కుందామని, సీతాపతి కళ్ళు మూసుకుంటే, స్వామివారి రూపానికి బదులు, ఆ గంటే అవుపిస్తోంది.

సీతాపతి బయటికి వచ్చేసాడు.

ఈశ్వరానందగారి కుటీరానికి వెలుపలవున్న ఓ చెట్టు కిందఉన్న బండరాయిమీద కూచుని, తను వచ్చిన పని గురించి ఆలోచించ సాగాడు. కాని, అతని ఆలోచ నలు, స్వామివారి మొహంమీది గంటు చుట్టూ ముసురు తున్నాయి, ఎంత వద్దనుకుంటున్నా.

ఇంతకూ, ఆ గంటు యెలా యేర్పడింది?

ఏదో ఏక్సిడెంట్ వల్లనేమో? సమాధానం చెప్పు కొన్నాడు సీతాపతి.

కాని, అదే సమయంలో స్వామివారి కుటీరంలోనుంచి ఓ శిష్యుడు బయటి కొస్తూ అవుపించాడు.

స్వామివారి మొహంమీది గంటుకు కారణం అతడ్ని అడగాలనిపించింది సీతాపతికి.

"క్షమించాలి!" అన్నాడు సీతాపతి, అతన్ని ఉద్దేశించి.

"నేనా?...యెందుకూ?" అంటూ అతడు వెనుదిరిగాడు అతడి కుడి కనుబొమ తమాషాగా పైకిలేచి పడుతోంది, అతడు మాటాడుతుంటే.

సీతాపతి మెదడులో చిన్న బల్బు వెలిగినట్టయింది.

అవును. ఆ ముఖం తనకు పరిచయమే. ఆ వ్యక్తిని తనెక్కడో చూసాడు.

అయితే, యెక్కడ?

తన జ్ఞాపకశక్తిని నిశిత పరీక్షకు పెట్టాడు కాసేపు.

"యేం?...మాట్లాడరేం?...యేంకావాలి?" కనుబొమ యెగరేస్తూ, దగ్గరకొచ్చి అన్నాడు ఆ శిష్యుడు.

అవును!...అతనే!...సందేహంలేదు...ఓ సారి తను రాజమండ్రి సెంట్రల్ జెయిల్ కు ఓ నేరస్తుడ్ని అప్పజెప్పడానికి వెళ్ళినప్పుడు అక్కడో దొంగని చూసాడు. ఆ వ్యక్తికీ, యితనికీ, చాలా దగ్గర పోలికలు ఉన్నాయి.

వెళ్ళి, ఈశ్వరానందగారి తతిమ్మా శిష్యుల్ని కూడా చూడాలనిపించింది సీతాపతికి.

"యేంలేదండీ!...దాహం వేస్తోంది...మంచినీళ్ళు దగ్గరలో యెక్కడ దొరుకుతాయో అడుగుదామని" అబద్ధం ఆడాడు సీతాపతి.

"అదుగో! అక్కడ..." అంటూ అక్కడున్న యింకో కుటీరంవైపు చెయ్యిచూపి వెళ్ళిపోయాడా శిష్యుడు.

సీతాపతికి, ఆ ఆశ్రమంమీద అనుమానాల తుప్ప రేగింది.

వెంటనే లేచి, స్వామివారివద్ద కూచున్న మిగతా శిష్య గణాన్ని పరిశీలించడానికి, మళ్ళా స్వామివారి కుటీరంలోకి వెళ్ళాడు.

యాత్రికులకు బాగా వెనుగ్గా నిలబడి, ఒక్కొక్క శిష్యుడ్ని నిశితంగా పరిశీలించసాగాడు.

అందరి మొహాలు గడ్డాలు మీసాలతో ఉండటం వల్ల, పోలీసు రికార్డ్సు ఉన్న కొందరి నేరస్తుల మొహాలు తనకు గుర్తున్నా, వారిని పోల్చుకో గలిగే అవకాశం లేదు.

అయితే, యేం చెయ్యాడం?...ఓ అయిడియా వచ్చింది బాగా ఆలోచించగా. వెంటనే తన దగ్గరున్న కెమెరాను రెండు మూడు కోణాల నుండి క్లిక్ మనిపించాడు, ఎవరూ గమనించకుండా.

13

తీసుకొళ్ళిన ఫొటోల్లోని ఒక్కొక్క మనిషి బొమ్మ ఎన్లార్జ్ చేయించి, పోలీసు రికార్డ్సులోని, నేరస్తుల ఫోటోలతో పోల్చి చూసేసరికి, ఆ ఆశ్రమంలో ఉన్నవాళ్ళందరూ, పాత నేరస్తులని తేలిపోయింది సీతాపతికి.

స్వామి ఈశ్వరానంద ఒకనాడు విజయవాడలో పెద్ద పేరుమోసిన గుండా. ఒకసారి యింకో గుండాతో అతనికి వచ్చిన తగూలోనే, ఆ మొహంమీద ఉన్న ఆ గంటు ప్రసాదింపబడింది, అవతలివాని కత్తిచేత.

అలాగే, అతని శిష్యుల్లో ప్రతి ఒక్కరూ, ఏదో ఓ క్రిమినల్ కేసులో, రెండు నుంచి పదేళ్ళ వరకు, జైలు గాలి పీల్చి బయటికొచ్చినవారే.

అయితే, యీ నేరస్తుల కూటమి, ఆశ్రమంలో ఉండి యేం చేస్తున్నట్టు?

నూకరాజు కేవలం వాళ్ళను కలుసుకుని కబుర్లాడ్డానికే, రెండు నెలలకో పర్యాయం క్రమం తప్పకుండా, అక్కడకు వెళ్తున్నాడని అనుకోవడానికి వీల్లేదు.

అంచేత, పిరియాడికల్‌గా, వాళ్లు కలుసుకోవడంలో యేదో విశేషం ఉంది. ఉంటే యేమిటది?

ఓ రోజైన నూకరాజు ఆశ్రమానికి వచ్చినపుడు యేం జరుగుతుందో చూస్తేగాని, ఆ రహస్యం వీడిపోదు.

నూకరాజు ఈశ్వరానంద ఆశ్రమానికి ఎప్పుడు వెళ్ళినా, ఆ రాత్రి ఆశ్రమంలో ఉండిగాని మరునాడు రాడు.

అంచేత, ఈ సారి నూకరాజు ఈశ్వరానంద ఆశ్రమానికి వచ్చినపుడు, తను వెళ్లి చూడాలి అనుకున్నాడు సీతాపతి.

ఓ రోజు సాయంకాలం అరవుతుండగా, నూకరాజు విశాఖపట్నం వదిలి, ఈశ్వరానంద ఆశ్రమానికి కార్లో వెళ్తున్నాడని వార్త వచ్చింది.

సబ్ ఇన్‌స్పెక్టర్ సీతాపతి, డి. ఎస్. పి. రంగనాథ రావు ఓ ప్రైవేటు కారు అద్దెకు తీసుకుని బయలుదేరారు వెంటనే.

రాత్రి తొమ్మిదవుతుండగా, శృంగవరపు కోట చేరు కున్నారు యిద్దరూ.

కారుని, శృంగవరపు కోట పోలీసు స్టేషను కస్టడీలో ఉంచి "మీలో పుణ్యగిరిని బాగా తెలిసినవారెవరు న్నారు?" అని అడిగాడు రంగనాథరావు స్టేషనులో ఉన్న జవాన్ల నందర్నీ సమావేశపరచి.

వెంకటస్వామి అనే జవాను ముందుకొచ్చి "నాకు బాగా తెలుసు సార్" అన్నాడు సాల్యూట్ చేసి.

"ఓకే!...యివాళ నీ డ్యూటీ మాతోనే...రా!" అంటూ అతన్ని మఫ్టీలో వెంటబెట్టుకుని పుణ్యగిరికి బయలు దేరారు.

అది డిసెంబరు మాసం చలి తీవ్రంగా ఉంది. అయినా చలిని తట్టుకోవడానికి భారీ యెత్తున యేర్పాట్లు చేసుకునే బయలుదేరారు వాళ్లు.

ముగ్గురికి సరిపోయేలాగు, మూడు పెద్ద ఫ్లాస్కులనిండా టీ పోయించుకున్నారు. రాత్రికి ఆకలేస్తే, తినడానికి బిస్కట్టు పాకట్లు పట్టుకున్నారు. ఫుల్ ఓవర్స్ వేసుకుని, తలకు మఫ్లర్లు చుట్టుకొన్నారు.

"ఈశ్వరానంద చాలా మహత్తు గలవాడని చాలా మంది విశాఖపట్నంలో చెప్పుకుంటున్నారు. వారిలో ఉన్న గొప్పతనం యేమిటి?" అన్నాడు రంగనాథరావు, వెంకట స్వామి లోకల్ మేన్ గదా, అదనంగా యేమన్నా చెప్ప గలదేమోనని.

"గొప్పతనం యేమిటి అంటారేమిటిసార్?...మిగతా సాధువుల్లాగ, భక్తులిచ్చే పైసలకు కక్కుర్తి పడరు సార్! అంతేకాదు... వారికి ప్రచారం అంటే గిట్టదు. బాబాలకు, సాధూలకు మొక్కకండి... మీలోనే ఆ దేవుడున్నాడు ... తెలుసుకోండి అంటారు తనవద్దకు వచ్చిన వాళ్ళతో...

కొంతమంది అతనికి శిష్యులుగా చేరటానికి కూడా వచ్చారు. వాళ్ళతో యేమన్నారో తెలుసా సార్?... యీ శిష్యులకే మోక్షం ప్రసాదించడానికి నేను నానా తంటాలు పడుతున్నాను...ఇహ కొత్తవాళ్లను చేర్చుకో లేనని పంపించి వేసారు...

ఇంకో విశేషం సార్!... పూర్వం ఋషులు అడవులకు పోయి తపస్సు చేసుకునే వారట... అలాంటి వాళ్ళు యీ మధ్య నాకు కనబడలేదు, స్వామి ఈశ్వరానందగారు తప్ప. వారు శిష్యులతో తరుచూ అడవుల్లోకి వెళ్ళిపోతారు తపస్సుకని. ఓసారి వెళ్ళితే మళ్ళా నెలవరకూ రారు ఆశ్రమానికి తిరిగి'' చెప్పాడు వెంకటస్వామి.

''మరి వీళ్ళకు జరుగుబడి ఎలాగు?'' అన్నాడు సీతాపతి.

''కొంత మంది అంటారు, నూకరాజు అనే మహాభక్తుడు వీరి అవసరాలను చూసుంటాడని. మరి కొంత మంది యేమంటారంటే స్వామి ఈశ్వరానందగారు తమ శక్తి వల్లనే, వాటిని సృష్టించుతారని. నా మట్టుకు నేను, వారు శృంగవరపుకోట వచ్చి, యేదీ కొనగా చూళ్ళేదు. ఎవర్నీ ఏదీ అడగ్గా చూళ్ళేదు, పైగా వాళ్ళే వచ్చిన వాళ్ళకు ప్రసాదమంటూ ఓ పండు చేతిలో పెడ్తారు'' చెప్పాడు వెంకటస్వామి.

''అలాగా?'' అన్నాడు రంగనాథరావు, ఆశ్రమం మిస్టరీ మరింత జటిలమవుతున్నట్టుగా అనిపించగా.

అరగంటలో పుణ్యగిరి చేరుకొన్నారు ముగ్గురూ.

''చూడు వెంకటస్వామి!...మనం యిప్పుడు స్వామి ఈశ్వరానంద గారి ఆశ్రమానికి వెళ్తున్నాం. అయితే, మనం రహస్యంగా యెవరికీ తెలియకుండా వెళ్ళాలి. అందరూ వెళ్ళే త్రోవంటగాకుండా, వేరే దోవగుండా కొమ్మల్ని తిన్నగా ఆశ్రమం వెనకాలకు తీసుకెళ్ళు'' చెప్పాడు రంగనాథరావు.

''అదేమిటి సార్!...యిప్పుడా వారి దర్శనం?...ఏమిటి సార్ విశేషం?'' కుతూహలంగా అడిగాడు వెంకటస్వామి.

"వారి దర్శనానికి వెళ్ళడంలేదు...వారి ఆశ్రమాన్ని రాత్రి పూట చూడ్డానికి వెళ్తున్నాం" చెప్పాడు సీతాపతి.

"సార్!...చాలా పాపం సార్!...వార్ని అనుమా నించకండి సార్!" ఎంతో బాధపడిపోతూ అన్నాడు వెంకటస్వామి.

"పోన్లేవోయ్!...ఆ పాపం అంతా నేనే తీసుకుం టాడు...సరేనా?...యీ విషయం ఎవరికీ చెప్పకు తెలిసిందా?" అన్నాడు రంగనాథరావు అధికార స్వరంతో.

"అలాగే సార్!" అంటూ వెంకటస్వామి, తన భావాల్ని తనలోనే అణిచేసుకుని, వార్ని, మామ్మూలు తోవనుంచి తప్పించేసి తుప్పల మధ్యనుంచీ, చెట్లమధ్య నుంచీ, తిన్నగా ఆశ్రమం వెనకాల ఉన్న రాతిగుట్టల మాటుకు తీసుకెళ్ళాడు.

ఆశ్రమం కుటీరాల్లో హరికేను లాంతర్లు వెలుగు తున్నాయి.

ఆశ్రమం ప్రాంగణంలో ఆశ్రమ వాసులు లాంతర్లు పుచ్చుకుని హడావుడిగా తిరుగుతున్నారు.

రంగనాథరావు రిష్టువాచీ చూసుకున్నాడు. పన్నెండు దాటి పదినిముషాలయింది.

"ఎవరి నివాసాలకు వాళ్ళుపోయి, విశ్రాంతి తీసు కోవడానికి బదులు, యింకా మెలకువగా ఉండి తిరుగు తున్నారేం అటూ ఇటూ?" స్వగతం అయినా బైటకు అనేసాడు రంగనాథరావు.

"సార్!...కాస్త మాపు నిదానించి చూడండి...

వాళ్ళెందుకు బిజీగా ఉన్నారో తెలుస్తుంది'' గొణిగాడు మెల్లగా సీతాపతి.

అప్పుడు తనదృష్టి కేంద్రీకరించాడు రంగనాథరావు.

ఆశ్రమం మధ్యలో కారు నిలిచిఉంది. కారు క్రింద గొయ్యి ఉన్నట్టుగా, కారుక్రింది భాగం వెలుతురుతో నిండి ఉండడం బట్టి తెలియ వస్తోంది.

''కారుకు రిపేరు వచ్చినట్టుంది...రిపేరు చేస్తున్నట్టుగా ఉన్నారు'' అన్నాడు రంగనాథరావు.

''లేదుసార్!......అది కారు రిపేరు కాదు... ఆ గొయ్యి తీరు చూస్తుంటే, నిత్యమూ వాడడానికే. దాన్ని తీసినట్టుగా ఉంది... చూద్దాం యింకే మవుతుందో'' అన్నాడు సీతాపతి.

మళ్ళా అందరూ మవునముద్ర వహించి దీక్షగా చూడ సాగారు.

అయిదు నిముషాలు గడిచాయి.

అటూ యిటూ యిద్దరు శిష్యులు లాంతర్లు పట్టుకొని రాగా, మధ్యలో ఓ శిష్యుడు న్యూస్ పేపరుతో కట్టిన పాకట్లు మోసుకుంటూ రాసాగాడు.

''సార్!...ప్లీజ్ నోట్ దట్'' ఆత్రంగా అన్నాడు సీతాపతి.

''యస్!...నోటింగ్'' అన్నాడు రంగనాథరావు తాపీగా.

ఆ పాకట్లు కారువద్దకు తీసుకు వచ్చారు వాళ్ళు. ఒక్కొక్క పాకట్టు గోతిలోఉన్న వ్యక్తికి అందిస్తుంటే, అతడు అందుకుని, కారు అడుగు భాగంలో అమర్చ సాగాడు. ఆ తర్వాత పళ్ళెలవంటి స్టీలు ఫ్రేములు నట్లతో బిగించాడు.

ఓ పావుగంట తర్వాత, కారు గోతిపైనుంచి బయటకు కదిలింది. గోతిలో ఉన్న వ్యక్తికూడా వెలుపలికి వచ్చాడు ఆ వెంటనే.

"సార్!... ఆ పాకట్లు హీరోయిన్ సంచులు. కారు అడుగు భాగంలో బిగించి, వాటిపైన కవర్లు తగిలించి తీసుకెళ్తున్నారు" అన్నాడు సీతాపతి.

"నాకూ అర్థమైంది...ఇదన్నమాట నూకరాజుకూ వీళ్ళకూ ఉన్న సంబంధం," అన్నాడు రంగనాధరావు సాలోచనగా.

"నాదో అయిడియా సార్" సీతాపతి అన్నాడు క్షణం పోయాక హుషారుగా.

"యేమిటది?"

"మనం వెంటనే శృంగవరపుకోటకు పోయి, మన పోలీసు ఫోర్సుతో రేపు నూకరాజు రాగానే, చుట్టుముట్టి చెక్ చేసి అరెస్టుచేస్తేనో?"

"నో!...అదికుదరదు...నూకరాజు దొరికిపోతాడు... అయిదో పదో కిలోల హీరోయిన్ మనకు చిక్కుతుంది... మనపేరు పేపర్లలో పడుతుంది...అయితే, యింత హీరోయిన్ యీ ఆశ్రమ వాసులకు యెక్కడ్నించి వచ్చింది అన్నది తేలదు. అది తేలితేగాని, దాని ఆరిజిన్ దొరకదు మనం కొట్టాల్సిన దెబ్బ అక్కడ."

"ఓకే సార్!...అలాగే."

"దెన్! కమాన్!...లెటజ్ గో" అంటూ కదిలాడు రంగనాధరావు.

తను కళ్ళతో చూసింది నమ్మలేక, మూగవాడిలా, కలలో నడుస్తున్న వాడిలా వారివెంట బయలు దేరాడు జవాను వెంకటస్వామి.

14

ఆ ఆశ్రమ వాసులుకి, అంత పెద్ద మొత్తాలు హిరో యిన్ ఎక్కడ్నించి వస్తోంది?

ఆ ప్రశ్నకు యింకా సమాధానం దొరకవలసి ఉంది.

"మనం ఆశ్రమానికి వెళ్తున్నప్పుడు, వెంకటస్వామి కొన్ని మాటలన్నాడు గుర్తుందా?" అన్నాడు డి. ఎస్. పి. రంగనాథరావు

"ఆఁ గుర్తుంది సార్! ఈశ్వరానంద శిష్యులతో తపస్సుకు వెళ్తాడన్నాడు" చెప్పాడు సబ్ ఇన్స్పెక్టర్ సీతాపతి.

"అదే! అదే! వాళ్ళు అడవుల్లోకి వెళ్తారు. అయితే, వాళ్ళకు అడవుల్లో హిరోయిన్ ఎక్కడ్నించి దొరుకు తుంది?"

"యస్ సార్! ఆ మిస్టరీని మనం విడగొట్ట గలిగితే, అంతా బయట పడుతుంది" అన్నాడు సీతాపతి హుషా రుగా.

"అయితే, ఆ పని నువ్వే చెయ్యాలి. వాళ్ళు తప స్సుకి వెళ్ళేటప్పుడు నువ్వూ వెళ్ళు," చెప్పాడు రంగ నాథరావు.

"అలా కాదుసార్! వాళ్ళు ఆశ్రమంలో ఉన్నప్పుడే వెళ్తాను. ఎందుకంటే, అప్పుడే నిరాటంకంగా రహ స్యాన్ని ఛేదించవచ్చు" అన్నాడు సీతాపతి.

"అది బాగానే ఉంది. కానీ అది అంతులేని అడవి. యెక్కడికని వెళ్ళి వెతగ్గలవు?" తన సందేహం వెలి బుచ్చాడు రంగనాథరావు.

"ఆశ్రమంలో యెలాంటి వాహనాలు లేవుగాబట్టి, వాళ్ళు నడిచే వెళ్తారన్నమాట. అంటే, వాళ్ళు ఒక్క

రోజులో నడవగలిగే - లేదా యింకోరోజు కూడా కలిపి నడవగలిగే దూరంలోనే, వాళ్ళ రహస్యం దాగివుంది. అంటే, పది చదరపు మైళ్ళ మేర అడవిని వెతికితే చాలు'' అంటూ తన ఊహను స్పష్టీకరించాడు సీతాపతి.

''ఓకే! దెన్ ప్రొసీడ్!'' అంటూ సీతాపతి కార్య క్రమానికి తన ఆమోదముద్రను వేశాడు రంగనాథరావు.

15

బాట కిరువైపులా వున్న దట్టమైన డొంకలవైపు ఎత్తైన చెట్లవైపు చూసుకుంటూ, మధ్యమధ్య ఆగి, పరిస రాలవైపు ఓసారి పరిశీలనగా చూసివెళ్తున్నాడు సీతాపతి.

అతడిప్పుడు కట్టెలు కొట్టేవాడి వేషంలో వున్నాడు. మాసిన పంచె నడుంకు చుట్టబడి వుంది. అదే తీరులో మట్టి కొట్టుకుపోయిన ఓ జుబ్బా వుంది పైన. నెత్తిమీద తలపాగ.

జుబ్బా లోపల, చంక క్రింద, కెమేరా దాచాడు. మొలకు పిస్టలు వుంచాడు. అయితే, అది అగపడకుండా, పైన పంచె చెంగు చుట్టాడు.

నోట్లో చుట్ట గుప్ గుప్ మంటూ పొగ వదులుతోంది. ఓ మాసిన గుడ్డలో కర్రలు కొట్టే కత్తి చుట్టబడింది. దాన్ని నెత్తిమీద పెట్టుకున్నాడు, కట్టెలు కొట్టేవాళ్ళ అలవాటు ప్రకారం.

మొదట వెడల్పుగా, మనిషి పోవడానికి వీలుగావుండే బాట క్రమేణా సన్నంగా అయిపోయింది. కాసేపటికి, అడ్డంగా పడే మొక్కల్ని, తీగెల్ని నరుక్కుంటూ పోతే గాని, ముందుకు పోలేనంత యిరుగ్గా తయారైంది.

సుమారు రెండుగంటలు సాగింది నడక. కాళ్ళు పీక సాగాయి. విపరీతంగా దాహం వెయ్యసాగింది. శరీరం విశ్రాంతికోసం అలమటించిపోతోంది.

మంచినీటికోసం నలువైపులా చూడగానే ఓ జల అవుపించింది. పరుగెత్తిపోయి, ఆత్రంగా తాగి, కడుపు నింపుకున్నాడు.

నీళ్ళు చల్లగా, తియ్యగా వున్నాయి. కొంచెం ఊరట కలిగినట్టనిపించింది.

జల కవతల, దట్టంగా నీడలు పరిచిన మామిడిచెట్టు అవుపించింది. కిందపడిన పండుటాకుల్ని, చెత్తచెదారాన్ని కాలితో బాగా ఊడ్చేసి, తలపాగా తీసి తలక్రింద ఒత్తుగా పెట్టుకుని నడుం వాల్చాడు.

ఆకుపచ్చని ఆకుల్ని, తప్పించుకుని నేలమీదకు జారి రాలేక తంటాలు పడుతోంది మధ్యాహ్నపు యెండ. ప్రకృతివేసిన పచ్చని పందిరివైపు చూస్తూ నిద్రలోకి జారుకున్నాడు సీతాపతి.

ఆ నిద్రలో యేదో పీడ కల. ఎవరో తన కడుపుమీద కూచుని నొక్కుతున్నట్టుగా ఫీలింగ్.

చట్టున మెలకువ వచ్చింది సీతాపతికి.

కారణమేమై వుంటుందా అని, మెల్లిగా తలయెత్తి పొట్టవైపు చూసాడు.

సీతాపతి గుండె కొట్టుకోవడం మరిచిపోయింది.

ఓ కొండ చిలువ, తీరుబడిగా, అతడి పొట్టమీంచి పాకుకుంటూ వెళుతోంది.

ఒళ్ళంతా చెమటలు పట్టింది.

కొండచిలువ పొడవు సుమారు పదిహేను అడుగులకు

తక్కువగాకుండా వుంది. తననో రాయి క్రిందో, మాను క్రిందో జమకట్టి, అది పైనుంచి దాటి వెళ్ళిపోతోంది. అదే, తను లేచి, విదిలించుకో బోయేటంతలో, అది బెదిరి, తనని గుర్తించి, చుట్టేసుకోవచ్చు. ఆ చుట్టల్ని విప్పుకోవడం బ్రహ్మాతరంగూడా కాదు.

అంచేత అది ప్రాకి వెళ్ళిపోయేంతవరకూ, కదలక, మెదలక, ఎప్పటిలా పడుకోవడమే ఉత్తమం అనుకున్నాడు.

అంచేత ఊపిరి బిగబట్టి శ్వాస మెల్లగా వదులుతూ, నిద్ర నటించడం మొదలుపెట్టాడు సీతాపతి.

అయితే, పాము ఒంటికి తగులుతుంటే, కలిగే ఆ ఫీలింగ్ దుర్భరంగా వుంది. ఒంట్లో నరనరంలో కంపరంగా వుంది.

అయినా, తను ప్రమాదంలో పడకుండా వుండాలంటే భరించక తప్పదు. తనకు తాను సమాధానం చెప్పుకున్నాడు.

పాము మెలమెల్లగా కదులుతోంది. దానివైపునుంచి దృష్టి మళ్ళించుకుందామని ఎంత ప్రయత్నించినా కుదరడం లేదు.

అయిదునిముషాలు గడిచాయి బరువుగా. ఆ అయిదు నిముషాలు, అయిదు యుగాలుగా తోచాయి అతడికి.

ఎలాగయితేనేం; పాము పూర్తిగా కదిలి వెళ్ళిపోయింది అతడిమీంచి.

ఒంటినిండా చెమటలు వరదలు కట్టాయి. లేచి గాఢంగా నిట్టూర్చాడు. అయిదునిముషాలు అలాగే కూర్చున్నాడు.

తిన్నగా వెళ్ళి, యిందాకటి జలపద్దనే మొహం కడు క్కుని నీరు త్రాగాడు.

తను అడివి మధ్యలో అలా అదమరిచి నిద్రపోవడం పెద్ద పొరపాటు అని గ్రహించాడు. ఆ పొరపాటు యిక చెయ్యకూడదనికూడా గట్టిగా నిశ్చయించుకున్నాడు.

ఉత్సాహం బలవంతంగా తెచ్చుకుని, మళ్ళా బయలు దేరాడు.

ఇలా ఫర్లాంగుదూరం వెళ్ళాడో లేదో, చిన్నగా కేక విన్పించిం దతడికి.

ఆ కేక ఎవరో స్త్రీ వేసింది!

ఉన్నచోటనే నిలుచుండిపోయి విన్నాడు.

ఆ కేక తర్వాత సన్నగా మూలుగు; మళ్ళా ఓ పెద బొబ్బ—ఆ తరువాత ఉస్సురంటూ పెద్దగా నిట్టూర్పు విన్పించాయి.

ఆ ధ్వనులు తనకు కుడివైపునుంచి, ఓ పొద మధ్యలో నుంచి వస్తున్నాయని గ్రహించి, నిశ్శబ్దంగా అటు నడి చాడు సీతాపతి.

పొదకు బాగా చేరువగా వచ్చి, మెల్లిగా కొమ్మల్ని ప్రక్కకు వంచి లోనికి చూసాడు.

ఆ తుప్పలమధ్య ఓ కొండజాతి స్త్రీ పురుషులున్నారు నగ్నంగా ఒకరిమీద ఒకరు.

ఆమెకు సుమారు ముప్పైఅయిదేళ్ళు వుంటాయేమో. కాని, అతడికి పాతికేళ్లు యింకా నిండివుండవు. కౌమారం అతడి ముఖంలో వుంది యింకా.

ఆ క్షణంవరకూ వాళ్ళు జరిపిన మోటుసరసం పతాక స్థాయి చేరుకోవడమే, ఆమె వేసిన కేక, మూలుగు వగైరా.

నవ్వుకుంటూ ఆ పొదకు దూరంగా వచ్చి నిలుచున్నాడు సీతాపతి.

ఐదునిముషాల తర్వాత తృప్తినిండిన కళ్ళతో ఆ జంట విడిపోయింది.

"ఎవర్రా అక్కడ?...ఏమిటీ పని?" అంటూ వాళ్ళ మధ్యకెళ్ళి నిలుచున్నాడు సీతాపతి.

కండల్లాంటి స్తనాలు ఎగిరిపడుతుండగా ఆమె కంగారుగా చీర అందుకుని, చెట్టుచాటుకు పరుగెత్తింది కట్టుకోవడానికి.

యువకుడు మాత్రం తాపీగా తన కాళ్ళదగ్గర వున్న బట్టల్ని అందుకుని కట్టుకుంటూ సీతాపతివైపు చూడసాగాడు తదేకంగా.

"ఏమిటీ వెధవ పని? ... తప్పు కాదూ? ... పాపం కాదూ?" అన్నాడు సీతాపతి, సీరియస్‌గా యువకుడి మొహంలోని భావాలు జాగ్రత్తగా పరిశీలిస్తూనే.

సీతాపతి యెత్తు పారింది. ఆ కుర్రాడి కళ్ళల్లో భయం తొంగిచూసింది.

"అదే నన్ను రెచ్చగొట్టింది. ఇక్కడికి రమ్మంది. లేకపోతే, నేనే దాన్ని రమ్మన్నానని మొగుడితో చెప్పి చంపిస్తానంది," నంగిరిగా మాటాడాడు ఆ కుర్రాడు.

ఈ లోపున ఆమె బట్టలు నిండుగా కట్టుకుని వచ్చింది.

"ఎవడివిరా నువ్వు? ఏమిటి బెదిరిస్తున్నావ్?" అంది ఆమె కోపంగా, దర్జా ఒలకబోస్తూ.

"మొగుడి కళ్ళుగప్పి, రంకుతనం సాగించడం గాకుండా, దబాయింపొకటా?" తిరిగి సీతాపతికూడా దబాయిస్తూ అన్నాడు.

ఆమె పరిస్థితి అర్థం చేసుకొన్నట్టుంది. ఆమె రోషం ఎగిరిపోయింది. నీళ్ళు నములసాగింది.

శంకరాదు మెల్లిగా కదలి వెళ్ళి, అడివిలో అదృశ్య మయ్యాడు.

"ఇక్కడికి మీ ఊరు ఎంతదూరం?" అడిగాడు సీతాపతి కొండస్త్రీని ఉద్దేశించి.

"ఏం? ఎందుకూ?" బెరుగ్గా అందామె.

"మీ ఊరొచ్చి నీ మొగుడికీ, ఊళ్ళోవాళ్ళకీ, నీ సంగతి చెప్పి తన్నించడానికి" అని ముందుకు కదిలి ఆమె రెక్క పుచ్చుకుని "రా! దారి చూపించు... వెళదాం" అన్నాడు సీతాపతి.

ఆమె అయిష్టంగా కదిలింది.

"పెళ్ళయి పదేళ్ళయింది. కడుపు పండలే. కోరికా తీరలే. కక్కుర్తిపడి చేసాను యీ పని. చెబితే నీకేం వస్తుంది?" అందామె దీనంగా.

వెంటనే వెనుతిరిగి "సరే, నిన్ను వెళ్ళిపోనిస్తాను. అయితే, నాకో సాయం కావాలి" అన్నాడు సీతాపతి.

"ఏం కావాలి? చెప్పండి" అందామె ఆశ్చర్యంగా చూస్తూ.

"ఈ ప్రాంతాల గురించి నీకు బాగా తెలుసునా?"

"ఆc... నా అరచెయ్యంత బాగా తెలుసును."

"ఇక్కడకు ఎవరయినా సాధూలు వస్తుంటారా?"

"ఆc... వస్తుంటారు. దేనికి?"

"ఆ మాట నువ్వు చెప్పాలి, వాళ్లెందుకొస్తున్నారో?"

"ఏమో నాకూ తెలీదుగాని, యీ దిక్కుగాపోతే, పెద్ద జాగా వుంటుంది, యినపముళ్ళ కంచె కట్టి. ఆ జాగాలో ఎప్పుడూ నాలుగు పులులు తిరుగుతుంటాయి.

అక్కడికి ఎవ్వరూ పోరు. అందరికీ భయం," చెప్పిం దామె.

"అంతేనా? ఇంకా విశేషాలేమైనా వున్నాయా?"

"అంతే! ఇంకేం లేవు" అని చటుక్కున ఏదో గుర్తుకు రాగా, "ఆఁ మర్చిపోయాను. అప్పుడప్పుడు విమానం వస్తుం దిక్కడకు" అందామె.

"ఏమిటీ? ఇక్కడ విమానాలు దిగే స్థలం వుందా?" అన్నాడు సీతాపతి ఆశ్చర్యంగా.

"విమానం అంటే, పైన పెద్ద రెక్కలుండి, పెద్ద చప్పుడు చేస్తుందది," అందామె.

"ఓహో! హెలికాప్టరా?" అన్నాడు సీతాపతి, ఆమె చెప్పింది అప్పటికి అర్థమై.

"సరే! మీ మేలు మర్చిపోను. వస్తాను" అందామె దండంపెట్టి బయలుదేరుతూ.

"ఒక్క నిముషం," అన్నాడు సీతాపతి.

ఆమె ఆగి చూసింది, 'యేమిటీ?' అన్నట్టుగా.

"నేనిలా అడిగినట్టు ఎవరికయినా చెప్పావో, మీ ఊరు వచ్చి, నిజంగా మీ ఆయనకు నీ సంగతి చెప్పే స్తాను, జాగ్రత్త" వేలు తాటిస్తూ, ఆమెవైపు సీరియస్‌గా చూసి అన్నాడు సీతాపతి.

"లేదు బాబూ! చెప్పను...ఒట్టు" అందామె నమ్మ కంగా.

"ఆఖరికి నీ ప్రియుడికి కూడా."

"వాడికికూడా చెప్పను దొరా" దండంపెట్టి కదలి వెళ్ళిపోయిందామె. ఆమెను వెళ్ళనిచ్చి, ఆమె కను మరు గవగానే, ఆమె చూపిన దిక్కుకు బయలుదేరాడు సీతాపతి ఉత్సాహంగా.

16

దాదాపు మూడు వేల చదరపు గజాల విస్తీర్ణం గల జాగా అది. ఇంచుమించు యిరవై అడుగుల యెత్తున, దట్టంగా దగ్గరగా అల్లిన ముళ్ళకంచె వుంది దాని చుట్టూ, ఆ జాగాకు మధ్యగా కర్రలతోటి కట్టిన ఓ షెడ్ వుంది. కంచెకు, యివతల దూరంగా ఖాళీ స్థలంలో చదునైన ప్రదేశం వుంది.

అది హెలికాప్టరు దిగడానికి ఉపయోగించే ప్రదేశం అని అర్థం చేసుకొన్నాడు సీతాపతి.

కంచెకు చేరువగా వెళ్ళి నిలుచున్నాడు.

అతని పాదాల చప్పుడు విన్పించగానే, అంతవరకూ విశ్రాంతిగా పడుకున్న ఓ పులి చట్టున లేచి, నిలుచుని గాండ్రించింది. ఆ తరువాత ఒకటీ, మరొకటీ, ఇంకొకటీ లేస్తూ అగపడ్డాయి.

ఆ స్థలమంతా చుట్టి తిరిగివస్తేగాని, యింకెన్ని పులుల్ని కాపలా పెట్టారో అర్థంగాదు అనుకున్నాడు.

అయితే, ఆ పులుల్ని, కాపలా పెట్టాల్సిన దేవరహస్యం అక్కడేముంది?

లోపలకు పోయి చూసిరావాలని నిశ్చయించుకున్నాడు.

కాని, లోనకు పోవడానికి వీలవుతుందా అని ఆలోచించాడు.

కంచె యెక్కి, అవతలవైపుకు దిగడం దుస్సాహసమే అవుతుంది. ఎందుకంటే, దిగుతూ తిన్నగా ఆకలితో వున్న పులుల నోట్లో పడాలి. ఒకవేళ అప్పుడు వాటిని తప్పించుకున్నా, షెడ్‌కు పరుగెత్తే లోపల అవి మీద పడతాయి.

అంచేత అలా పోవడం కుదరదనుకున్నాడు.

వేరే అవకాశం ఏమన్నా వుందా అని ఒకసారి ఆవరణ అంతా కలియజూసాడు.

ఎంతో కట్టుదిట్టంగా, దుర్భేద్యమైన కోటలా దాన్ని కట్టినవాళ్ళు, చిన్న చిన్న లోపాల్ని పట్టించుకోకుండా వదిలిపెట్టిన తీరు చూసి లోలోన నవ్వుకున్నాడు సీతాపతి.

చకచకా కదిలి, కంచెకు చేరువగా, తన ప్రవేశానికి అనువైన ఓ చెట్టును యెక్కాడు. మెల్లగా చివరికొమ్మలను చేరుకొన్నాడు.

తనున్న చెట్టుకొమ్మలతో చేతులు కలిపినట్టుగా ఇంకో చెట్టు వుంది. ఆ చెట్టుకొమ్మలు అందుకుని, అవతలి చెట్టుని చేరుకోవడం అతనికి కష్టం కాలేదు.

అయితే, అన్ని చెట్లూ, అతడు మొదట ఊహించినంత చేరువగా లేవు. కొన్ని చెట్లకొమ్మలు కనీసం అయిదడుగుల దూరంలో వున్నాయి.

సగందూరం వచ్చి, వెనుదిరిగి పోవడమన్న ప్రసక్తే లేదు అతనికి. పైగా, ఆ షెడ్‌లో వున్న రహస్యాన్ని ఛేదించడానికి నిశ్చయించుకుని వచ్చాడాయె.

మృత్యువుతో దోబూచులాడ్డానికే నిశ్చయించుకున్నాడు.

ఎంతో నేర్పుగా తను చెయ్యవలసిందల్లా, ఒక్క ఊపులో ముందుకు దూకి, అవతలి కొమ్మను పట్టుకుని వేలాడ్డం.

కాసేపు, తను అడవి వీరుడు టార్జానుగా ఊహించుకుని, ప్రాణాల్ని దైవంచేతిలో పెట్టి, చెట్టునుంచి చెట్టుకు ఎగురుతూ చివరిచెట్టుకు చేరుకొన్నాడు అరగంటలో.

ఆ చెట్టుమీంచి షెడ్ పైకప్పుమీదికి దిగడం ఒకటే మిగిలివుంది.

కంచెను చేరుకునేంతవరకూ తలగుడ్డగా వాడి, ఆతరువాత నడుంకు కట్టుకున్న తువ్వాలును తీసాడు. దానికి, తన పంచెను విప్పి, ముడేసాడు.

అలా తయారు చేసిన ఆ గుడ్డని ఓ చివర, ఓ బలమైన కొమ్మకు గట్టిగా కట్టాడు.

దాన్ని పట్టుకుని వేలాడి చూసి, తన బరువుకి అది ఊడి రాదని నిర్ధారించుకున్నాక, దాని సాయంతో ప్రాగి, షెడ్ పైకప్పుమీదకు చేరుకున్నాడు సురక్షితంగా చివరకు.

గుడ్డ రెండో చివర్ని, షెడ్‌మీదున్న ఓ కర్రకు చుట్టాడు ఊడిరాకుండా. తను వచ్చిన పని అయిపోతే, తిరిగి, ఆ గుడ్డ సాయంతోనే గదా చెట్టు కొమ్మలను చేరుకుని వెనక్కి వెళ్ళేది!

షెడ్‌ను చేరుకునే ప్రయత్నంలో లీనమై అంతవరకూ సీతాపతి గమనించలేదు గాని, అతడి ప్రతి కదలికనూ, దిగువనున్న పులులు జాగ్రత్తగా పరిశీలిస్తూనే ఉన్నాయి. అతను క్రిందపడితే చాలు మీదబడి వల్చుకుతిందామని ఆశపడుతూ, ఆకలి అరుపులు అరుస్తూనే ఉన్నాయి.

షెడ్ పైకి చేరాక, దిగువకు ఓసారి చూసాడు సీతాపతి యథాలాపంగా.

అతనినే గమనిస్తూ, షెడ్‌చుట్టూ, దిగువన పులులు నిలుచుని చూస్తున్నాయి.

లోనకు వెలుతురు చొరడంకోసం షెడ్ పైకప్పులో గ్లాసులు బిగించి ఉన్నాయి. వాటిని మెల్లగా ఊడదీసి, తన పని అయిపోగానే, తిరిగి బిగించెయ్యాలన్న ఉద్దేశంతో ఆ అద్దాల్ని తీయడానికి ప్రయత్నించాడు. కాని లాభంలేక పోయింది.

పైన చెయ్యి పెట్టి నొక్కేసరికి, పెళ్ళున విరిగాయి అద్దాలు.

పైకప్పుమీద బోర్లా పడుకుని, వెంటిలేటర్లలోంచి, శరీరాన్ని లోనకు దూర్చి పరిశీలించడం మొదలుపెట్టాడు.

లోన ఉన్న పెద్ద టేబిల్స్, కుర్చీలు, వాటిపైన అమర్చిన, గాజు కుప్పెలూ, టెస్ట్ ట్యూబులూ వగైరా సామగ్రి అంతా చూశాక లోన ఉన్నది లేబరేటరీ అని గ్రహించాడు.

లోనుంచి పైకి ఎగసి, ఘాటుగా తియ్యగా ముక్కుకు సోకే వాసననుబట్టి లోన నల్లమందు వాడడం జరిగిందని అర్థం చేసుకొన్నాడు.

ఆంధ్రదేశంలో ఉందని చిన్ని చెప్పిన లేబరేటరీ అదే అని మనసులో అనుకొన్నాడు.

లోనకు దిగి అదంతా ఫోటోలు తీస్తే బావుంటుందనుకున్నాడు.

ఏవిధంగా దిగితే తాను సులువుగా లోనకు చేరుకో గలడో అని గదంతా వెతుకుతుంటే లోనించి 'బుస్' మన్న శబ్దం వినవచ్చింది.

ఆ శబ్దం వచ్చిన దిక్కుకు చూసేసరికి అక్కడో నాగు పాము ఉంది. అతడి గుండాగినట్టయింది.

నేలమీద బోర్లాడుతున్న ఆ పాముని తాను పట్టించుకో నక్కర్లేదనుకుంటూ లేబ్ ఎక్విప్ మెంట్ వైపు చూసాడు.

ఆ యేపరేటస్ని చుట్టుకుని మరి రెండు విషసర్పాలు కదులుతూ అవుపించాయి.

ఆ పాములు వాటంతటవే లోనకు చొరబడ్డవి కావనీ,

ఈశ్వరానంద శిష్యులే వదిలి వెళ్ళిపోయారనీ తెలుసు కున్నాడు సీతాపతి.

ఇహ తను లోనకు దిగి, లేబ్ ఫొటోలు తీరుబడిగా తీసే అవకాశం శూన్యం అనుకున్నాడు.

పైనించి లోనకు వేలాడుతూనే తనతో పాటుగా తెచ్చిన కెమేరాతో నాలుగు స్నాప్స్ లాగాడు.

ఆ తరువాత బయటకొచ్చి షెడ్ పైకప్పు మీంచి యింకో రెండు స్నాప్స్ లాగాడు. ఆ పరిసరాలు పడే లాగు.

ఆ తరువాత షెడ్ పైకప్పుమీది క్రకు కట్టిన గుడ్డ విప్పి దాని ఆధారంగా చెట్టుకొమ్మల్లోకి చేరుకుని, వచ్చిన త్రోవనే బయటకు వచ్చాడు.

బయటనుంచి ముళ్ళకంచె వెనుకనున్న షెడ్‌నీ ముళ్ళ కంచె గేటుతో సహా మరో రెండు స్నాప్స్ లాగాడు.

తను వచ్చినపని విజయవంతంగా కొనసాగడంతో, హుషారుగా వెనక్కు బయలుదేరాడు సీతాపతి.

17

ఎస్. పి. సుందర్రామ్ తన ఛాంబరులో అడుగుపెట్టిన రంగనాథరావుని అతని వెంట ఉన్న సీతాపతిని చూసి భావగర్భితంగా నవ్వాడు.

"సార్!...మన ఆపరేషన్స్ అన్నీ పూర్తయ్యాయి. డ్రగ్ ట్రాఫిక్‌లోని మూల విరాట్టులు, చిల్లరదేవుళ్ళమీద కావాల్సిన సాక్ష్యాధారాలు సేకరించడం జరిగింది" చెప్పాడు రంగనాథరావు.

"ఇన్నాళ్ళూ కేసు నీ కంట్రోల్లో నడిచింది. ఓసారి అంతా చెప్పు" అన్నాడు సుందర్రామ్ రంగనాథరావుని కూచోమని సైగచేసి.

రంగనాథరావు కూచున్నాడు. కాని సీతాపతి నిల్చునే ఉన్నాడు.

ఇటీవల సీతాపతి సాధించిన ఫలితాలతో సహా తా మెలా సాక్షుల్ని, సాక్ష్యాధారాల్ని సేకరించి ఉంచిందీ వివరంగా చెప్పాడు రంగనాథరావు.

"వెల్ డన్!" అంటూ రంగనాథరావుని, సీతాపతిని కంగ్రాచ్యులేట్ చేసాడు ఎస్. పి. సుందర్రామ్.

ఆ తరువాత తన రివాల్వింగ్ ఛెయిర్‌లో కూలబడి రెండు నిముషాలు దీర్ఘంగా ఆలోచించాక "మనం ఒకే రోజున ఒకే టైములో యీ డ్రగ్ ట్రాఫిక్ దొంగల్ని అరెస్టు చెయ్యాలి. లేకపోతే ఒక చేప పట్టుబడిందని తెలియగానే, తతిమ్మా చేపలు జారుకుంటాయి దొర క్కుండా" చెప్పాడు సుందర్రామ్.

"అదే నా ఉద్దేశమూకూడా సార్!" అన్నాడు రంగనాథరావు.

"మరి ఒరిస్సానుంచి వచ్చే సప్లయిలు గురించి యేంచేద్దామంటావ్?" అన్నాడు ఎస్.పి యింకో క్షణం పోయాక.

"ఆ రాష్ట్ర పోలీసులకు రిపోర్టు చేద్దాం. దాంతో మన బాధ్యత తీరిపోతుంది. ఇహ మన రాష్ట్రంలోని రింగ్ని స్మాష్‌చేసాక, యింకెవరికి సప్లయి చెయ్యగలరు నల్లమందు. ఆ సప్లయిలు కూడా వాటంతటవే నిలిచిపోతాయి" చెప్పాడు రంగనాథరావు.

"వెల్ డెన్. అరెస్ట్ వారంట్లు తయారు చెయ్యడానికి యేర్పాట్లు చేస్తాను. యీ అరెస్టుల్ని జాగ్రత్తగా నువ్వే ఆర్గనైజ్ చెయ్యాలి." అన్నాడు సుందర్రామ్.

"అలాగే సర్!" అంటూ లేచాడు రంగనాథరావు.

అతని వెంట బయటకి వచ్చేశాడు సీతాపతి ఆనందో ద్రేకంతో పొంగిన గుండెలతో.

18

"ఆఁ మన హెలికాప్టరు వచ్చేస్తోంది" అన్నాడు ఈశ్వరానంద ఉత్సాహంగా, సన్నగా వినపడసాగిన హెలికాప్టర్ రొద గుర్తుపట్టి.

క్షణం చెవులు రిక్కించి "అవును!...వచ్చేస్తోంది" అన్నారు అతని శిష్యులు.

తమకీ, లేబరేటరీ చుట్టూ తిరిగే ఆకలితో ఉన్న పులులకీ, ఆ హెలికాప్టర్ తెచ్చే సరుకులే ఆధారం. అందులో వచ్చిన నాలుగు మేకపోతుల్ని పులులకు ఆహారంగా వేస్తే గాని, వాటిని బోనుల్లోకి తరిమి లేబరేటరీ తెరవడం కుదరదు.

హెలికాప్టరు బాగా దగ్గరయినట్టుగా, రొద ఎక్కువైంది.

ఆ తరువాత ఉధృతంగా వీచిన గాలికి చెట్లు ఆరాటంగా ఊగుతుంటే, హెలికాప్టర్ నేలకు దిగింది.

హెలికాప్టర్‌లో యిద్దరు వ్యక్తులున్నారు. వాళ్ళు ఈశ్వరానందకు నమస్కారం చేశారు. ఈశ్వరానంద శిష్యులు హెలికాప్టరులోని సరుకంతా దించగానే, హెలికాప్టరులోని వ్యక్తులకి, కరెన్సీ ఉన్న సూట్‌కేసు అందించాడు ఈశ్వరానంద.

హెలికాప్టర్ వచ్చినట్టుగానే, అరగంట తర్వాత వెనక్కి వెళ్ళిపోయింది.

"పాపారావ్!... మేకల్ని పులులకు పడేసెయ్ క్విక్" ఆర్డరిచ్చాడు ఈశ్వరానంద.

పాపారావు పులులకు మేనేజరు. మేకల కళేబరాల్ని కంచెమీంచి అవతలకు గిరవాటేసాడు.

మేకల కళేబరాలమీదకు కలియబడ్డాయి పులులు. క్షణాలమీద మేకల్ని చీల్చి, రవంతకూడా మిగలకుండా తినేసాయి.

ఆ తరువాత, కంచె తలుపులు తెరిచి, పులుల్ని బోను ల్లోకి తరిమి బంధించాడు పాపారావు.

ఆ మీదట సుబ్బయ్య అనే శిష్యుడు వెళ్ళి లేబ్‌లో ఉన్న పాముల్ని వేరే గూళ్ళల్లో పడేసి మూతలు వేసాడు. ఆ పాములకి పచ్చి కోడిగుడ్లని ఆహారంగా విదిల్చాడు.

షెడ్‌లోకి వెళ్ళగానే అందర్నీ ఆకర్షించింది, నేల మీద పడి ఉన్న గాజుముక్కలు.

"వెంటిలేటర్ యెలా పగిలింది?" అందరి మనస్సుల్లోనూ యిదే ప్రశ్న.

"యే కోతులో విరగ్గొట్టి ఉంటాయి" అన్నాడు లేబ్ కెమిస్ట్ నిరంజనమూర్తి.

ఆ సమాధానం అందరికీ తృప్తికరంగానే తోచిందిగాని "ఇన్నాళ్ళయింది లేబ్ యిక్కడ పెట్టి. ఎప్పుడూ యిలా జరగలేదే" అని ఈశ్వరానంద అనడంతో, మళ్ళా అందరి మనస్సుల్లో అనుమానాల నీడలు పొడసూపాయి.

"మన భయాలు మనవి. అందుకే ప్రతి చిన్నదానికీ, ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి మనకు" అన్నాడు నిరంజనమూర్తి.

దాంతో ఈశ్వరానంద తన ఆలోచనలు కట్టిపెట్టి "ఆల్ రైట్! పని ఆరంభించండి స్టాక్స్ త్వరగా కావాలన్నాడు నూకరాజు" అంటూ శిష్యుల్ని అదిలించాడు.

లేబ్ యేపరేటర్ మీద ధూళిదులిపి నీళ్ళతో కడిగి, పొడిగా ఆరాక నల్లమందుని యేపరేటస్‌లోకి ఫీడ్ చేసాడు నిరంజనమూర్తి.

హిరోయిన్ తయారు కావడానికి ప్రోసెస్ ఆరంభ మైంది.

అకస్మాత్తుగా వాళ్ళున్న పరిసరాల్లో అలజడి కలిగి నట్టయింది. తమతమ పనులు నిలిపేసి తలఎత్తి చూసాడు ఈశ్వరానంద, అతని శిష్యులు.

వారిని చుట్టుముట్టి, రైఫిల్స్ గురిపెట్టి నిలుచున్నారు పోలీసులు.

నోట మాటరాక స్థాణువుల్లా నిలుచుండిపోయారు అందరూ.

రెండు క్షణాలు పోయాక ఈశ్వరానంద, మరో యిద్దరు శిష్యులు, కంగారుగా కదలబోయేరు గాని "ఈశ్వరానంద ... వార్నింగ్ యివ్వకుండా కాల్చడం మాకు ధర్మం.కాదు కాబట్టి యీసరికి ఊరుకుంటున్నాను" అంటూ డి.యస్.పి. రంగనాధరావు ముందుకొచ్చాడు, బేడీలు పట్టుకుని.

పాకట్టులో ఉన్న ఇరవై కేజీల నల్లమందు, ప్రోసెస్‌లో ఉన్న యింకో రెండు కేజీల నల్లమందు, లేబ్ ఎక్విప్‌మెంటు—అక్కడున్న సూచిక పుల్లతో సహా స్వాధీనం చేసుకునే ముందు ఆయా వస్తువుల్ని ఆయా స్థానాల్లో ఉండగా స్పష్టమైన ఫోటోలు తియ్యబడ్డాయి.

అదే సమయంలో విశాఖపట్టణంలో ఓ కస్టమర్‌కి హిరోయిన్ యిస్తుండగా (ఆ కస్టమర్ పోలీసుమనిషే) నూకరాజు రెడ్ హేండెడ్‌గా పట్టుబడిపోయాడు.

అతని యింటిలోను, గోడలకున్న వుడెన్ పానలింగ్ లోని రహస్యపు అరల్లోంచి పోలీసులు సుమారు పది కేజీల హిరోయిన్ స్వాధీనం చేసుకొన్నారు.

అదేవిధంగా విజయవాడలో ఓ డెలివరీ బాయ్‌కు హిరోయిన్ పాకట్టు యిచ్చి యెవరికి యెలా అందించాలో వివరిస్తుండగా రామశర్మ దొరికిపోయాడు.

వీరుగాక సుమారు అరవై మంది చిన్న డీలర్లు, యిరవై మంది హెంచ్ మెన్, పాతికమంది మిడిల్ మెన్ పోలీసులు జరిపిన మెరుపు దాడిలో సరుకుతో సహా దొరికిపోయారు.

ఆ విధంగా ఈశ్వరనంద శిష్యులు అంతా పట్టుబడటంతో ఆంధ్రదేశంలో డ్రగ్ ట్రాఫిక్ అంతరించిపోయింది.

—: ఐ పో యి ం ది :—